
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 24.0

ANDHRAJYOTHY



నల్లగొండ

5

సోమవారం 15 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.40 (307.2834)	2,39,078	3,22,089
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.78 (4.14)	9,510.93	10,900.54
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.898 (42.5720)	3,12,693	3,19,094

చికెన్ ధరలు	లైవ్ : రూ.140	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.240



విద్యార్థులపై సెల్ఫ్‌ఫైనాన్స్
కోర్సుల భారం

- 50 శాతం మేర విద్యార్థులు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి
- 10 కోర్సులకే బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద విద్యార్థులు
- యూనివర్సిటీ సమస్యలపై గవర్నర్ దృష్టి సారించేనా?
- నేడు ఎంజీయూ నాలుగో స్నాతకోత్సవం

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో విద్యార్థులపై సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల భారం పడుతోంది. యూనివర్సిటీలో 22 కోర్సులతో పాటు 18 డిపార్ట్‌మెంట్లు ఉన్నాయి. అయితే ప్రభుత్వం కేవలం 10 కోర్సులకే బడ్జెట్ కేటాయించగా, మరో 12కోర్సులు సెల్ఫ్‌ఫైనాన్స్‌తో కొనసాగుతున్నాయి. ఈ కోర్సులు చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజులు చెల్లించాల్సి వస్తుండటంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది.

– (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)


ఎంజీ యూనివర్సిటీలో సైకాలజీ కోర్సు సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుకు నిర్వహిస్తుండగా, ఫీజు రూ.20వేల వరకు ఉంది. అందులో విద్యార్థులు 50శాతం ఫీజు చెల్లిస్తే ప్రభుత్వం రూ.10వేలు చెల్లిస్తోంది. విద్యార్థి తప్పనిసరిగా రూ.10వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ ఐఎం బీఏ కోర్సుకు రూ.37వేలు ఫీజు ఉండగా, అందులో రూ.20వేలు ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్‌గా చెల్లిస్తే రూ.17వేల వరకు విద్యార్థి ఫీజు కట్టాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీటెక్ ట్రిబుల్‌ఈ, సీఎస్ఈ, ఈసీఈవంటి సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులకు రూ.57,200 వరకు ట్యూషన్ ఫీజు ఉంది. అందులో ప్రభుత్వం రూ.35వేలవరకు చెల్లిస్తుండగా, మరో రూ. 22,200 విద్యార్థులు చెల్లించాలి. 2007లో ప్రారంభమైన ఎంజీ యూనివర్సిటీ నాలుగో స్నాతకోత్సవానికి సిద్ధమైం ది. 2017, 2018, 2019లో స్నాతకోత్సవాలు నిర్వహించిన యూనివర్సిటీ తాజాగా, ఈనెల 15న నాలుగో స్నాతకోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. ఈ స్నాతకోత్సవానికి యూనివర్సిటీల కులపతి, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రానున్నారు. ప్రస్తుతానికి యూనివర్సిటీ బీ+ గ్రేడ్‌లో ఉండగా, 2028 నాటికి న్యాక్ అక్రిడేషన్‌లో ఏ+ గ్రేడ్‌కు చేరుకోవాలని యత్నిస్తోంది. ఈ నేపథ్యంలో సమస్యలు అధికంగా ఉన్నప్పుడు ఎలా సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

టీచింగ్ స్టాఫ్ అరకొరగానే..

యూనివర్సిటీ 2007లో ఆరుకోర్సులతో 500మంది

– మిగతా 7వ పేజీలో...

నేడు ఎంజీయూకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



నల్లగొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో ఈ నెల 15న జరిగే నాలుగో స్నాతకోత్సవానికి గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి జిష్ణుదేవ్‌వర్మ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నా రు. ఆయనతోపాటు హైదరాబాద్‌లోని ఐఐటీ డైరెక్టర్ బీఎస్‌మూర్తి స్నాతకోత్సవ ఉపన్యాసం చేయనున్నారు. ఈ స్నాతకోత్సవంలో 22 మందికి పీహెచ్‌డీలు, 53 మంది పీజీ విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేయనున్నారు. డిగ్రీ, పీజీ, బీఈడీ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నారు. ఎంజీయూలో స్నాతకోత్సవ ఏర్పాట్లను ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, సీఈవో ఉపేందర్‌రెడ్డి ఆదివారం పర్యవేక్షించారు.

గవర్నర్ షెడ్యూల్ ఇలా

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ నెల 15న 9 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి రోడ్డుమార్గంలో ఎంజీయూనివర్సిటీకి 10.45కి చేరుకుంటారు. 11నుంచి 12.30గంటల వరకు ఎంజీయూ స్నాతకోత్సవంలో ప్రసంగం,విద్యార్థులకు బంగారు పతకాలను, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారు. మధ్యాహ్న భోజనం, విశ్రాంతి అనంతరం 2గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కు చేరుకొని అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. 3.15గంటలకు కలెక్టరేట్ నుంచి హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో వెళ్తారు.



యూరియా కోసం మోత్కూరులో బారులుదీరిన రైతులు (ఫైల్)

మొర ఆలకించండి

- ఉమ్మడి జిల్లాలో వెంటాడుతున్న యూరియా కొరత
- పంటల దిగుబడిపై ప్రభావం
- పత్తి, వరి పంటలకు యూరియా అందించాల్సిన తరుణం
- డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేస్తున్నామంటున్న అధికారులు

యూరియా కష్టాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. రేయింబవళ్లు శ్రమించి సాగు చేసిన పంటలు యూరియా లేక దెబ్బతింటున్నాయని ఆవేదన చెందుతున్నారు. జూన్, జూలై మాసాల్లో తగినన్ని వర్షాలు లేవు. ఆగస్టు, సెప్టెంబరులో భారీ వర్షాలు కురిశాయి. ఇప్పటికీ వర్షాలు కురుస్తున్నాయి. ఆగస్టులో కురిసిన వర్షాలకు రైతులు పెద్ద మొత్తంలో వరి సాగు చేశారు. ఆలస్యంగా సాగు చేసిన పత్తి పంట పూత, కాత దశలో ఉంది. అటు వరికి, అటు పత్తికి యూరియా అందించాల్సిన అవసరం పెరిగింది. ఈ తరుణంలో సరిపడా యూరియా అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే అధికారులు మాత్రం డిమాండ్‌కు తగినట్టు యూరియా సరఫరా చేస్తున్నామని చెబుతున్నా, సరిపడా యూరియా అందక ఉమ్మడి జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట రైతులు ఆందోళనలు నిర్వహిస్తూనే ఉన్నారు.

7

– (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

నేటి 'ప్రజావాణి' రద్దు : కలెక్టర్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పలివెల సాయుధ పోరాటాల గడ్డ

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మునుగోడు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా సాయుధ పోరాటానికి పలివెల గ్రామం అడ్డాగా నిలిచిందని సీపీఐ జిల్లా కార్యద ర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం మండలంలోని పలివెల, కొరటికల్ గ్రామాల్లో నిర్వహించిన సాయుధ పోరాట వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. సాయుధ పోరాట అమరులు కొండవీటి గురునాథరెడ్డి, కొండవీటి బచ్చిరెడ్డి, కొండవీటి జగన్మోహన్‌రెడ్డి, మిరియాల లింగయ్య, అంజయ్య స్తూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పలివెల గ్రామం కొండవీటి కుటుంబం పోరాటాలు నిర్వహించిందన్నారు. బచ్చిరెడ్డి, గుర్నాథ్‌రెడ్డి, గోస్కొండ పెద్దులు మరో 30మంది పోరాట యోధులు నిజాంకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. సాయుధ పోరాటం లో నిరుపేద ప్రజలకు 10 లక్షల ఎకరాల భూ మిని పంచిపెట్టిన ఘనత కమ్యూనిస్టులదని అన్నారు. కార్యక్రమంలో అమరుల కుటుంబ సభ్యులు కొండవీటి సునీల్ రెడ్డి, కొండవీటి రవీందర్‌రెడ్డి, కొండవీటి సురేందర్‌రెడ్డి, కొండవీటి శేఖర్‌రెడ్డి, సీపీఐ నాయకులు గురుజ రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు, బోలుగురి నరసింహ, సురిగి చలపతి, చాపల శ్రీను, మందుల పాండు ఉప్పునుతుల రమేష్, మాజీ జడ్పీటీసీ గోస్కొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాదగోని సాయిలు, ఆనగంటి నరసింహ, తిరుమల యాదయ్య పాల్గొన్నారు.



సాయుధ పోరాట యోధుడు కొండవీటి గుర్నాథ్‌రెడ్డి స్తూపం వద్ద పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

- రెట్టింపునకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ
- హైదరాబాద్ శివారు ప్రాంతాలపై దృష్టి
- పరిశ్రమలు, టూరిజం అభివృద్ధిపై నజర్
- విధివిధానాలు రూపొందిస్తున్న అధికారులు
- ఆర్‌ఆర్‌ఆర్ సమీపంలోకి పరిశ్రమల తరలింపు?
- జిల్లాల్లో నూతన పారిశ్రామికవాడలు

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే నిధులు అవసరం. దీంతో ఆదాయ వనరులను పెంచుకుని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ప్రధానంగా కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, గనులు, రిజిస్ట్రేషన్ల శాఖలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఆదాయ వనరుల సమీకరణ, లక్ష్యాలపై ఇటీవల కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. లక్ష్య సాధనకు అన్ని శాఖలు పక్కా ప్రణాళికలతో ముందుకు సాగాలని సబ్ కమిటీ అధికారులకు సూచించింది.

– (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

ఆదాయం పెంచేద్దాం!



సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని రాష్ట్ర ఆదాయాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అందులో భాగంగా అన్ని శాఖలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న ప్రాంతాల్లో ఆదాయం పెంపుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించే పనిలో నిమగ్నమైంది. ఉమ్మడి జిల్లా నగరానికి చేరువలో ఉండటంతో రియల్ ఎస్టేట్‌తో పాటు ఎక్సైజ్, వాణిజ్య పన్నులశాఖ ద్వారా సర్కారుకు ఆదాయం సమకూరుతోంది. ఆదాయాన్ని మరింతగా పెంచేందుకు హైదరాబాద్ సమీపంలో ఉన్న జిల్లాలో పారిశ్రామికాభివృద్ధితో పాటు టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు సన్నద్ధమవుతోంది.

కీలక శాఖల నుంచి నికరంగా ఆదాయం

వాణిజ్య పన్నులశాఖ ద్వారా యాదాద్రి జిల్లాలో నెలకు రూ.6కోట్ల నుంచి రూ.8కోట్ల మేర పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. ఏటా జిల్లా నుంచి ప్రభుత్వానికి మొత్తంగా రూ.60కోట్ల నుంచి రూ.70కోట్ల మేరకు ఆదాయం వస్తోంది. ఎక్సైజ్‌శాఖ ద్వారా రూ.450కోట్లు, మైనింగ్ శాఖ ద్వారా రూ.5కోట్ల ఆదాయం సమకూరుతోంది. చౌటుప్పల్, యాదగిరిగుట్ట, భువనగిరి బీబీనగర్, రామన్నపేట, మోత్కూరు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో భూముల విక్రయాల ద్వారా రూ.150కోట్ల మేర ఆదాయం వస్తోంది. ఈ శాఖల ద్వారా ప్రభుత్వం మరింత ఆదాయ పెంపునకు ఉన్నతాధికారులు అధ్యయనం చేస్తున్నారు.

నూతన పారిశ్రామిక వాడలు

ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమల తరలింపునకు ప్రభుత్వం విధివిధానాలు రూపొందించే పనిలో నిమగ్నమైంది. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న జిల్లాల్లో నూతనంగా పారిశ్రామికవాడల ఏర్పాటుకు సర్కారు యోచిస్తోంది. రీజనల్ రింగ్‌రోడ్డు వెంట ఇండస్ట్రియల్ జోన్‌లను ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే యాదాద్రి జిల్లాలో భువనగిరి, చౌటుప్పల్, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మండలాల్లో పలు పరిశ్రమలు ఉన్నాయి. టీఎస్ ఐ-పాస్ కింద మొత్తం 1,090 పరిశ్రమలు ఉండగా, వీటి ద్వారా 41,270 మంది ఉపాధి పొందుతున్నారు. టీఐడియా, టీప్రైడ్ పథకాల కింద 796యూనిట్లు మంజూరయ్యాయి. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఎంఎస్ఎంఈ ఏర్పాటైంది. హరిత పారిశ్రామిక పార్కుకు

– మిగతా 6వ పేజీలో...

26 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

- ఎగువ నుంచి నాగార్జునసాగర్‌కు 2,39,978 క్యూసెక్కుల రాక
- దిగువకు 3,22,089 క్యూసెక్కులు విడుదల

7

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



దేవరకొండ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, రైతులకు యూరియా సరఫరలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యూరియా కోసం రైతులు ఉదయం నుంచే పీఏసీఎస్‌ల వద్ద చెప్పులు, పట్టాదార్ పాస్‌పుస్తకాలు క్యూలైన్‌లో ఉంచి గంటలతరబడి ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. రైతులు యూరియా కోసం పనులు మానుకొని పడిగాపులు కాసే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీ మహిళలకు రూ.2500, తులం బంగారం, రూ.4వేల పెన్షన్ ఏమైందని ప్రశ్నించారు. ఢిల్లీ పర్యటనలే తప్ప ప్రజల, రైతుల సమస్యలను సీఎం పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

గిరిజనుల గోడు తీరేనా?

- గుర్రంబోడుతండాలో 540సర్వే నెంబరులో ఉన్నది 1,873 ఎకరాలు
- ఆరు వేల ఎకరాలకు పైగా ఉన్నట్లు చూపి నకిలీ పత్రాల సృష్టి
- బండి సంజయ్ ఆందోళనతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం
- నాటి ఘటనతో నేటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో నిలిచిన రెవెన్యూ సేవలు

6

సాగర్‌లో పర్యాటకుల సందడి



నాగార్జునకొండకు వెళ్లి లాంచీ దిగి వస్తున్న పర్యాటకులు

నాగార్జునకొండకు మూడు ట్రిప్పులు నడిచిన లాంచీలు

నాగార్జునసాగర్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో రెండు రోజులు సెలవు దినాలు కావడంతో పర్యాటకుల సందడి నెలకొంది. సాగర్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, విజయ విహార్, కొత్తవంతెన, ప్రధాన జలద్యుత్ కేంద్రం తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొంకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడు ట్రిప్పులు, జలాశయంలో మరో రెండు జాలీ ట్రిప్పులు లాంచీలు నడిపినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

సాగర్‌ను సందర్శించిన డిప్యూటీ అకౌంటెంట్ జనరల్

ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్‌ను ఆదివారం రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ సంజయ్ కామినేని సందర్శించారు. ఉదయం ఆయన సాగర్ ప్రధాన డ్యాం, గ్యాలరీలను, ఎత్తిపోతల జలపాతాన్ని సందర్శించారు. అనంతరం హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టును తిలకించారు.

అక్కడ చరిత వనం, ధ్యాన వనం, జాతక వనం, స్తూప వనాలను తిలకించారు. మహాస్తూపం లోపల అష్టబుద్ధుల విగ్రహాల వద్ద బుద్ధ జ్యోతిని వెలిగించారు. అనంతరం మహాస్తూపం దిగువన ఉన్న సమావేశ మందిరంలో బుద్ధవనం వీడియోను వీక్షించారు. బుద్ధవనం ఈవో శాసన, మేనుజర్ రవిచంద్రలు ఆయనను పంచశీల కండువాతో సన్మానించారు. సాగర్, బుద్ధవనం విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వారికి వివరించారు. ఆయన వెంట సీనియర్ ఆడిట్ ఆఫీసర్ బ్రిజేస్ కుమార్, సాగర్ డ్యాం డివిజన్ సూపరెండెంట్ దుర్గప్రసాద్, ఎస్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

కమ్యూనిస్టుల పోరాటం
చరిత్రాత్మకం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పరిపాలకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి కమ్యూనిస్టులు జరిపిన మహత్తర పోరాటం చరిత్రాత్మకమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. సాయిధ రైతాంగ పోరాట వార్శికోత్సవాల కార్యక్రమాన్ని సీపీఎం ఆధ్వర్యంలో చిట్యాల మండలం గుండ్రాంల్లిలో నిర్వహించారు. జెండాను సీతారాములు ఆవిష్కరించి మాట్లాడారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని సయ్యద్ మక్బూల్ హింసాకాండను కొనసాగించి, పైశాచికత్వానికి నిదర్శనంగా మారాడన్నారు. రజాకార్ల కబంద హస్తాల నుంచి ప్రజలను విముక్తి చేయడానికి కమ్యూనిస్టు పార్టీ ప్రజాదళాలు స్వేచ్ఛకోసం నెత్తురును చిమ్మించాయన్నారు. కమ్యూనిస్టుల పోరాటంతోనే రజకార్లు తోకముడిచారన్నారు. రజాకార్ల పాలనకు వ్యతిరేకంగా జరిగిన మహత్తర పోరాటాన్ని మతఘర్షణలుగా బీజేపీ వక్రీకరించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, బొజ్జ చినవెంకులు, మల్లం మహేష్, జిట్ట సరోజ, పెంజర్ల సైదులు, రాచకొండ వెంకటేశ్వర్లు, లూర్దు మారయ్య, కుమ్మరి శంకర్, అరూరి శ్రీను, కత్తుల లింగస్వామి, ఐతరాజు నర్సింహ, పంది నరేష్, కె.యాదయ్య పాల్గొన్నారు.

గుర్రంబోడుతండా గిరిజనుల గోడు తీరేనా?

సూర్యాపేట/మఠంపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుర్రంబోడుతండా గిరిజనులకు నిరాశే మిగిలింది. ఆందోళనలు చేసిన బాధితులపై కేసులు నమోదుకాగా, జైలుకు వెళ్లి వచ్చినా సమస్య ఇప్పటికీ తీరలేదు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా అక్కడ భూములు కోల్పోయిన ముంపు బాధిత రైతులకు అప్పటి ప్రభుత్వం మఠంపల్లి మండలం పెదవీడు పంచాయతీ పరిధిలో ఉన్న గుర్రంబోడు సమీపంలోని గుట్టల భూములు ఇచ్చింది. దట్టమైన అడవి, రాళ్ల బీళ్లను భూమిగా మార్చి చాలా సంవత్సరాలుగా సంబంధిత రైతులు సాగు చేసుకుంటున్నారు. గుర్రంబోడుతండా కాలక్రమేణా గ్రామపంచాయతీగా మారింది. 30సంవత్సరాల క్రితం ఎకరం రూ.15వేల లోపు ఉండగా, ప్రస్తుతం ఎకరాకు రూ.30లక్షలు పలుకుతోంది. భూముల ధర పెరగడంతో కబ్జాదారుల కన్ను పడింది. ఈ క్రమంలో 540 సర్వే నంబర్‌లో వాస్తవంగా 1873 ఎకరాలు ఉండగా 100మందికి పైగా రైతులు అక్కడి భూములు సేద్యం చేసుకుంటున్నారు. కొంతమంది అక్రమార్కులు 540 సర్వేనెంబరు పేరిట ఆరు వేల ఎకరాలకు పైగా పెంచి తప్పుడు రికార్డులు సృష్టించారు.



సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని గుర్రంబోడుతండాలోని 540 సర్వేనంబర్‌లో భూములు

- 540సర్వే నెంబరులో ఉన్నది 1873 ఎకరాలు
- ఆరు వేల ఎకరాలకు పైగా ఉన్నట్లు చూపి నకిలీ పత్రాల సృష్టి
- బండి సంజయ్ ఆందోళనతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం
- నాటి ఘటనతో నేటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో నిలిచిన సేవలు

ఆన్‌లైన్‌లో నిలిచిన 540 సర్వేనంబర్ సేవలు

సర్వేనంబర్ 540పై ప్రభుత్వం ఆన్‌లైన్ సేవలను మూడేళ్ల క్రితం నిలిపివేసింది. దీంతో అర్హులకు న్యాయం జరగకపోగా, పట్టా ఉన్న వారికి సాంకేతికపరమైన సమస్యలు పరిష్కారం కావడం లేదు. 100మందికి పైగా రైతులకు ఈ సర్వేనంబర్‌లో భూమి కొనుగోలు, పట్టా మార్పిడి, రైతు బీమా, రైతుబంధు వంటి పథకాలు వర్తింపు, సరిదిద్దడం వంటి ప్రక్రియ నిలిచిపోయింది.

అక్రమ పట్టాల విషయం వెలుగుచూసిందిలా

గుర్రంబోడుతండా పరిధిలోని 540సర్వే నెంబరులోని భూములు తమకు చెందినవని పారిశ్రామికవేత్తలు వచ్చి పట్టాలు చూపించటంతో విషయం వెలుగుచూసింది. ఈ భూములు తమవని, ఇక్కడ పవర్ ప్లాంట్, స్టీల్ ప్లాంట్ నిర్మించేందుకు సర్వే చేయించుకునేందుకు సంబంధిత అధికారులతో వచ్చారు. సర్వేను రైతులు అడ్డుకోవడంతో ప్రజాభిప్రాయ సేకరణకు రంగం సిద్ధం చేశారు. మూడు సార్లు రైతులు అడ్డుకోవటంతో ప్రజాభిప్రాయ సేకరణ నిలిచింది. బాధిత రైతులు రాకుండా నాలుగోసారి పెదవీడు గ్రామపంచాయతీ పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ ప్రాంతంలో పట్టాలు ఉన్న ఓ పారిశ్రామికవేత్త మరొకరికి విక్రయించటంతో స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి షెడ్డు నిర్మించి స్థానిక రైతులను రాకుండా అడ్డుకున్నారు. రైతుల ఆందోళనకు అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ గుర్రంబోడుతండా వద్దకు రైతులకు మద్దతుగా నిలిచారు. ఈక్రమంలో పోలీసులు, రైతులకు ఘర్షణ జరిగి ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై 47మంది రైతులపై కేసు నమోదైంది. సంబంధిత రైతులు జైలుశిక్ష అనుభవించి బెయిల్‌పై బయటకువచ్చినప్పటికీ కోర్టు వాయిదాలకు తిరుగుతున్నారు. ఈ ఘటనపై విచారణ చేసిన అధికారులు రెండేళ్ల క్రితం ఇద్దరు తహసీల్దార్లు, వీఆర్వోలను సస్పెండ్ చేశారు. కొంతమంది అక్రమార్కుల కబ్జా చేసిన భూమిని కాపాడుకునేందుకు అధికారులు, నేతలను ఆశ్రయిస్తున్నారు.

అమలు కాని అప్పటి కలెక్టర్ ఆదేశాలు

గిరిజనుల వినతుల మేరకు అప్పటి సూర్యాపేట జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, రిటైర్డ్ ఆర్డీవో భిక్షంనాయక్ గుర్రంబోడు తండా తండాకు వచ్చి వివాదాస్పద భూములను పరిశీలించారు. 2023 అక్టోబరు, నవంబరు నెలలో గుర్రంబోడు 540 సర్వేనంబర్‌లో నెలకొన్న భూ వివాదంపై పూర్తి సమాచారం అందించాలని సర్వేకు ఆదేశించారు. 540 సర్వేనంబర్‌లో భూముల వివరాలకు అనుగుణంగా రైతులను కలవడం హక్కుదారులను గుర్తించడం, సాగులో ఉన్న భూములు పరిశీలించి కబ్జాలో ఉన్న రైతుల పేర్లు నమోదు చేయాల్సి ఉండగా, సక్రమంగా నిర్వహించలేదు. 20 రోజుల్లో పూర్తిస్థాయి సర్వేచేసి 30 రోజుల్లో అర్హులైన రైతులకు తానే స్వయంగా తండా రైతుల, పెద్దల సమక్షంలో పట్టాలు ఇస్తానని అప్పటి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి హామీ ఇచ్చి వెళ్లారు. మూడేళ్ల క్రితం ఇద్దరు తహసీల్దార్లు, వీఆర్వోలను సస్పెండ్ చేసినా, అధికారుల హామీ అమలు కాలేదు.

బాధితులకు న్యాయం జరగాలంటే..

ముంపు బాధిత రైతులకు భూమి అప్పగించేందుకు నిర్ణయించిన అప్పటి పాలకులు మఠంపల్లి మండలం గుర్రంబోడుతండాలో అటవీ భూములను కేటాయించింది. 50ఏళ్ల క్రితం ఉన్న చట్టాలకు అనుగుణంగా గిరిజన రైతులకు పూర్తి హక్కులు కల్పిస్తూ డీఫాంలు జారీ చేసి, ఏ రైతుకు ఎక్కడ భూమి ఇచ్చారో.. హద్దులతో అప్పగించాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో గిరిజన రైతులు కనబడిన భూములను బాగుచేసుకుని వ్యవసాయం చేశారు. అప్పట్లో పదుల సంఖ్యలో ఉన్న రైతులు రానురాను వందల సంఖ్యలోకి కుటుంబాలు, వారసులు పెరుగుతూ ఎవరి భూమి ఎవరు చేసుకుంటున్నారో తెలియని అయోమయం నెలకొంది. సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ముంపునకు గురైన రైతులకు న్యాయం జరగాలన్నా.. గతంలో జరిగిన తప్పులు సరిదిద్దాలన్నా.. రెవెన్యూ శాఖ కీలకమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. 540సర్వే భూములను ప్రక్షాళన చేసి ఆక్రమణదారులను గుర్తించి సాగులో ఉన్న రైతులకు పాస్ పుస్తకాలు, హక్కులు కల్పించి కబ్జాదారులను ఖాళీ చేయించడం, అర్హులైన గిరిజన రైతులుంటే పట్టాలు ఇవ్వడం ద్వారా సమస్యకు కొంతవరకైనా పరిష్కారం లభిస్తుంది.

అధికారులు ఇచ్చిన పట్టా చెల్లదంటున్నారు



సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో సర్వస్వం కోల్పోయిన మాకు పెదవీడు రెవెన్యూలో పునరావాసం కల్పించి అక్కడే భూములు ఇచ్చారు. 30ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన పత్రాల ద్వారా పట్టాలు చేయించుకున్నాం. దశాబ్ద కాలం నుంచి సాగు చేసుకుంటున్నా భూములను అక్రమంగా సర్వే చేస్తుండగా అడ్డుకున్నాం. మా వద్ద ఉన్న పట్టాలు చూపించాం. మా వద్ద ఉన్న పట్టాలను అధికారులకు చూపిస్తే అవి చెల్లదంటున్నారు. పట్టాలు ఇచ్చిన వారే చెల్లదని అంటుంటే తీవ్ర ఆవేదనకు గురవుతున్నాం.

- రమావత్ మంగునాయక్, రైతు

30 ఏళ్లుగా సాగు చేస్తున్నాం



నాకు సర్వే నెంబరు 540లో 1.5 ఎకరాల పొలం పట్టా ఉంది. సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన నాటి నుంచి మా నాన్న, ఆ తర్వాత నేను ఉన్న భూములను సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నాటి నుంచి సేద్యం చేస్తున్న భూములను కొందరు దళారులు ఈ భూములు మావి అంటూ భయాందోళనకు గురిచేస్తున్నారు. మా భూములు ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. నకిలీ పట్టాలు సృష్టించి ఇబ్బంది పెడుతున్నారు.

- రమావతు మట్టియ్య, రైతు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



గుర్రంబోడుతండా గిరిజనుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. కొన్ని వివాదాల కారణంగా ప్రభుత్వం ఆ సర్వే నంబర్‌పై ఉన్న ఆన్‌లైన్ సేవలను నిలిపివేసింది. 540 సర్వే నెంబరు ఉన్న భూములను సర్వే చేయాలని ప్రజాసంఘాలు, రైతుల నుంచి ఒత్తిడి వస్తోంది. ఈ విషయమై ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పేద గిరిజన రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం.

- మంగారాథోడ్, తహసీల్దార్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నల్లగొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలోని నార్కట్‌పల్లి-అద్దంకి బైపాస్ రోడ్డుపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. నల్లగొండ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన బాపన్ సర్దార్(28), తనుమయ్(28) జీవనోపాధి కోసం నల్లగొండకు వచ్చారు. సర్దార్ నెల రోజుల క్రితం నల్లగొండకు వచ్చి నార్కట్‌పల్లి-అద్దంకి బైపాస్ రోడ్డులోని మిర్యాలగూడ రోడ్డులో లెప్రసీ కాలనీ సమీపంలోని దత్తసాయి వెంచర్‌లో నివాసముంటూ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేస్తున్నాడు. తనుమయ్ నాలుగైదు రోజుల క్రితం నల్లగొండకు చేరుకొని ట్యాంక్ నిర్మాణ పనుల్లో చేరాడు. ఈ ఇద్దరు శనివారం రాత్రి 11గంటల తర్వాత ద్విచక్ర వాహనంపై దత్తసాయి వెంచర్ నుంచి మిర్యాలగూడ రోడ్డు వైపు వెళ్లి తిరిగి తాము నివాసముండే ప్రాంతానికి తిరిగి వస్తుండగా ఎఫ్‌సీఐ గోదాంకు వెళ్లే వద్ద వాహనాన్ని యూటర్న్ తీసుకునే క్రమంలో డివైడర్ ఢీకొట్టి కింద పడిపోయారు. ఇదే సమయంలో ఓ గుర్తు తెలియని వాహనం వీరిద్దరి బలంగా ఢీకొట్టడంతో తనుమయ్ అక్కడికక్కడే మృతి చెందగా, బాపన్ సర్దార్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. దత్తసాయి సైట్ సూపర్‌వైజర్ భూక్యా నాగేంద్ర ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి మత్స్య కార్మికుడు మృతి



యాదగిరి(ఫైల్)

నల్లగొండ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి మత్స్యకార్మికుడు మతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లాకేంద్రంలో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం గజలాపురం గ్రామానికి చెందిన సింగం యాదగిరి (37) పెద్దదేవులపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో కొనసాగుతున్నారు. యాదగిరి జిల్లాకేంద్రంలోని బీటీఎస్‌లో నివాసముంటూ పానగల్లు ఉదయ సముద్రంలో చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 13వ తేదీన సాయంత్రం సింగం యాదగిరి, అతని కుమారుడు వరుణ్ తేజ్ కలిసి చేపల వేటకు పానగల్లు ఉదయ సముద్రానికి వెళ్లారు. వరుణ్‌తేజ్‌ను చెరువు కట్టపై కూర్చోపెట్టి యాదగిరి వల తీసుకొని చేపలు పట్టేందుకు చెరువులోకి వెళ్లాడు. తెప్పపై చెరువులో చేపలు పడుతుండగా ఒకసారిగా ఈదురుగాలులతో పాటు వర్షం కురవడంతో తెప్ప ప్రమాదవశాత్తు తిరగబడడంతో యాదగిరి చెరువులో గల్లంతయ్యాడు. వరుణ్ తేజ్ వెంటనే అక్కడ ఉన్న వారి సహాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. శనివారం రాత్రి వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం జాలర్ల సహాయంతో ఉదయ సముద్రంలో వెతకగా యాదగిరి మృతదేహం లభ్యమైంది. యాదగిరి భార్య సత్యావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ ఎర్ర సైదులు తెలిపారు.


గుట్టలో ప్రైవేట్ లాడ్జి సీజ్

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 14, (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ఓ ప్రైవేట్ లాడ్జిని పోలీసులు సీజ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలో ప్రైవేట్ లాడ్జిలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు పక్కా సమాచారం మేరకు భువనగిరి ఎస్‌వోటీ పోలీసు, గుట్ట పోలీసులు కలిసి ఈ నెల 13వ తేదీ రాత్రి దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఓ మహిళతో అసాంఘిక కార్యక్రమాల నిర్వహణకు సహకరిస్తున్న వ్యక్తి, ఇద్దరు విటులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్న లాడ్జీని సీజ్ చేశామని తెలిపారు.

మూసీవాగులో చిక్కుకున్న మేకలు

● గొర్లకాపరులను కాపాడిన గ్రామస్థులు

సూర్యాపేటరూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వరద ప్రవాహం పెరగడంతో గొర్లకాపరులు, మేకలు వాగులో చిక్కుకున్న సంఘటన మండల పరిధిలోని కాసరబాద మూసీ వాగులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కాసరబాద గ్రామానికి చెందిన బొమ్మకంటి సోమమ్మ, మోర్ల రాములుకు చెందిన 20 మేకలను తోలుకొని రోజుమాదిరిగానే మూసీ వాగుకు వెళ్లారు. మూసీ ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరగడంతో అధికారులు ఎక్కువ మొత్తంలో గేట్లు ఎత్తడంతో మూసీ వాగులో వరదప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. దీంతో మూసీ వాగులో మేకలను మేపుతున్న గొర్లకాపరులు వరద ప్రవాహన్ని గమనించక పోవడంతో చూట్టు నీటి ఉధృతి పెరగడంతో వాగులో చిక్కుకున్నారు. గమనించిన స్థానికులు తాళ్ల సహాయంతో గోర్ల కాపరులను బయటకు క్షేమంగా తీసుకొచ్చారు. వరద ఉధృత్తి పెరగడంతో మూడు మేకలు గల్లంతయ్యాయి. మిగిలిన మేకలు వాగులోనే చిక్కుకున్నాయి. గ్రామస్థులు మూసీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో మూసీ నీటి విడుదలను ఆపారు. నీటి ప్రవాహం తగ్గకపోవడంతో మేకలు మూసీలోనే చిక్కుకున్నాయి.



మూసీ వాగులో చిక్కుకున్న మేకలు, గొర్లకాపరులు

ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేస్తూ..

భువనగిరి టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కోర్టు బెయిల్స్ సీజ్ అయిన వాహనాల విడుదలకు నకిలీ డాక్యుమెంట్స్ తయారు చేస్తున్న అంతర్ జిల్లా ముఠా భువనగిరి పోలీసులకు చిక్కింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం పోలేనుగూడెం గ్రామానికి చెందిన తిరుగమల్ల సోమయ్య (ఇతర పేర్లు పాలే శ్యామ్, ఎర్రమళ్ల శ్యాంప్రసాద్), ఖమ్మంకు చెందిన సింగిరెడ్డి విజయ్ భూపాల్‌రెడ్డి కలిసి ఈ దందా నడిపిస్తున్నారు. వీరు గ్రామపంచాయతీ కార్యదర్శులు పేరిట నకిలీ రబ్బరు స్టాంపులు తయారు చేసి నల్లగొండలోని ఓ ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఖాళీ ఇంటి టాక్స్ రశీదు పుస్తకాలు, ఆస్తిపత్రాలు సేకరించారు. నకిలీ ఆధార్‌కార్డులు ఉపయోగిస్తూ నకిలీ డాక్యుమెంట్స్ రూపొందించిన కోర్టుల్లో నిందితులకు స్వయంగా జమానత్ ఇవ్వడం, సీజ్ అయిన వాహనాల విడుదలకు నకిలీ డాక్యుమెంట్స్ అందజేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.మూడు వేల వరకు తీసుకుంటారు. ఆ ముఠా భువనగిరి వచ్చిందని ఎస్‌ఓటీ ఇచ్చిన సమాచారం ఆధారంగా శుక్రవారం రాత్రి ఓ లాడ్జిపై దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. నకిలీ రబ్బరు స్టాంపులు, ఫోర్జరీ డాక్యుమెంట్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జరిపిన దర్యాప్తులో ఇప్పటివరకు 24 నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించినట్లు తేలింది. భువనగిరిలో కూడా ఈ ముఠా చేసిన అక్రమ తంతుపై లోతైన దర్యాప్తు జరపనున్నట్లు, ఖాళీ రసీదు పుస్తకాలు, ఆస్తిపత్రాలు విక్రయించిన నల్లగొండ ప్రింటింగ్ ప్రెస్‌పై కూడా దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ ముఠాను శనివారం రాత్రి పొద్దుపోయాక కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు 14 రోజులు రిమాండ్‌కు తరలించారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ రబ్బర్‌స్టాంపులు, రసీదు పుస్తకాలు

క్రీడా కోటాలో ఉద్యోగ అవకాశాలు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): క్రీడా కోటాలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని కోదాడరూరల్ సీఐ ప్రసాదలింగం అన్నారు. సూర్యా పేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం 35వ సబ్ జూనియర్ జిల్లాస్థాయి పోటీలు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంతోమంది క్రీడాకారులు క్రీడా కోటలో మంచి మంచి ఉద్యోగాలు సాధించారన్నారు. శనివారం ప్రారంభమైన సబ్ జూనియర్ జిల్లా స్థాయిలలో పోటీల్లో మొదటి బహుమతిని దురాజ్‌పల్లిలోని మైనార్టీ పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతిని తుంగతుర్తి గురుకుల పాఠశాల విద్యార్థులు గెలుచుకున్నారు. ఎంపిక చేసిన 25 మంది బాలురు, 25 మంది బాలికలు ఈ నెల 25 నంచి 28వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నామా నర్సింహారావు, జిల్లా ఉపాధ్యాక్షుడు రామచందర్‌రావు, ఎస్ఐ పరమేష్, బసవయ్య, శంకర్‌రెడ్డి, ముడెం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ ప్రసాదలింగం

ఆదాయం పెంచేద్దాం!

(5వ పేజీ తరువాయి)

కావడంతో కాలుష్య సమస్యలేని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటవుతున్నాయి. ఈ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 35వేల మందికి ఉపాధి లభిస్తోంది. 2వేల ఎకరాల్లో ఉన్న ఈ ఇండస్ట్రియల్ పార్క్ హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉండటంతో ఇక్కడికి పరిశ్రమలు తరలివస్తున్నాయి. పరిశ్రమల ఏర్పాటుతో సర్కారుకు భారీగా ఆదాయం సమకూరనుంది. ఈ నేపథ్యంలో మరిన్ని పారిశ్రామిక వాడల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టిసారించింది.

ఆదాయం పెంపునకు ప్రత్యేక కార్యాచరణ

జిల్లాలోని హెచ్ఎండీఏ, వైటీడీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒకప్పుడు జోరుగా సాగింది. జాతీయరహదారులకు ఇరువైపులా ఎక్కడ చూసినా లేఅవుట్లు కన్పించాయి. ప్రస్తుతం ప్లాట్ల విక్రయాలు పూర్తయ్యాయి. కొత్తగా వెంచర్లు, లేఅవుట్లు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. రాష్ట్రంలో అపార్ట్‌మెంట్లు, ప్లాట్ల విక్రయాల్లో మంచి ప్రగతి ఉన్నా వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాల విక్రయాల్లో ఆశించినంత వేగం కనిపించడంలేదు. దీంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో రీజినల్ రింగు రోడ్డు సమీపంలో పరిశ్రమలతోపాటు నూతనంగా పలు ప్రాజెక్టులను ఏర్పాటుచేస్తే రియల్ వ్యాపారం మరోసారి ఊపందుకోనుంది. రాష్ట్రంలో అతిపెద్ద పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని తిరుమల స్థాయిలో ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. లక్ష్మీ నరసింహస్వామి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తోంది. తిరుపతి దేవస్థానం(టీటీడీ)తరహాలో ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తోంది. ఆలయ పరిసరాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులన్నింటికీ టీటీడీ మాదిరిగా స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. అందులో భాగంగా ఆలయ పరిధిలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులతోపాటు ప్రభుత్వ భూములు, ఆలయ అవసరాల కోసం సేకరించిన భూములను వైటీడీ(యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్) పరిధిలోకి తీసుకురానుంది. టెంపుల్ సిటీ జియోగ్రాఫికల్ ఏరియాగా రూపొందించేందుకు నిర్ణయించింది. ప్రభుత్వం త్వరలోనే టెంపుల్ సిటీ జియోగ్రాఫికల్ ఏరియాను ఫైనలైజేషన్ చేయనుంది. జిల్లాలో భారీ సాగునీటి ప్రాజెక్టు పనులపై దృష్టి సారించింది. ఇక ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలతో జలాశయాల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. వరదలతో ఇసుక మేటలు ఏర్పడుతుండగా, ఇసుక ద్వారా ఖజానాకు ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

ఐఎంఏ అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హైదరాబాద్ బ్రాంచ్ అధ్యక్షుడిగా యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన బూడిద నరేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో నరేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. నరేందర్‌రెడ్డి ఎన్నిక పట్ల దేవలమ్మనాగారం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఐసీఏఆర్ పీజీ ఎంట్రన్స్‌లో 88వ ర్యాంకు

గరిడేపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామానికి చెందిన వెలుగూరి వెంకటనర్సింహారావు, కవిత దంపతుల కూతురు వెలుగూరి పావని ఆదివారం ప్రకటించిన ఐసీఏఆర్ పీజీ ఎంట్రన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా 88వ ర్యాంకు బీసీ కేటగిరిలో 52వ ర్యాంకు సాధించింది. పావని ప్రస్తుతం అరుణాచల్‌ప్రదేశ్‌లో అగ్రికల్చర్ చదువుతోంది. ఇటీవల జరిగిన ఐసీఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్)పీజీ ఎంట్రన్స్‌కు హాజరై ఎంట్రన్స్ పరీక్ష రాసింది.

అలరించిన యక్షగాన ప్రదర్శన

కనగల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం గడ్డంస్వామి కళా బృందం నిర్వహించిన ఎల్లమ్మ జననం యక్షగాన ప్రదర్శన భక్తులను అలరించింది. శివుడు, పార్వతి, మన్మథుడు, హిమవంతుడు, మేనకల పాత్రలతో కళాకారులు ఆకట్టుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌చీదేటి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వందల ఏళ్ల నాటి సాంప్రదాయ కళారూపాలు కనుమరుగుతున్న నేటి కాలంలో యక్షగానకళను సజీవంగా నిలుపుతున్న కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈవో అంబటి నాగిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ జినుకుంట్ల చంద్రయ్య, ఉపేందర్‌రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు, ఆండాలు అర్చకులు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం రాత్రి కురిసిన వర్షానికి ధగధగ మెరిసింది. పసిడి వర్ణంలో వర్షపు నీరు జాలువారుతుండగా ఆలయ అందాలు విద్యుత్ కాంతులతో మరింత విరజిమ్మాయి. అంతటా చీకట్లు కమ్ముకోగా ఆలయం మాత్రం బంగారు రంగులో మెరిసింది. వర్షంలో భక్తులు తడుస్తూనే ఆలయ అందాలకు మంత్రముగ్ధులయ్యారు. కురుస్తున్న వర్షం..జాలువారుతున్న వర్షపు నీరు, బంగారు వర్ణంలో విద్యుత్‌కాంతులతో ఇల వైకుంఠాన్ని తలపించిందని భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు.

● ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట

● ఏ కొమ్మ పువ్వు..?



రంగును చూసి అది ఎర్ర గులాబీ అని అనుకుంటారు. కానీ, అది గులాబీ పూవు కాదు. గులాబీ రంగులో ఉండి అంతే సైజులో ఉన్న దానిమ్మ చెట్టుకు పూసిన పూవు. ఇది యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణ పరిధిలోని ముక్తాపూర్ గ్రామానికి చెందిన మంటిపల్లి లింగస్వామి ఇంటిలోని దానిమ్మ చెట్టుకు పూసింది. ఈ పూవును చూసి స్థానికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. గులాబీ పూవును పోలిన దానిమ్మ పూవును చూసేందుకు గ్రామస్థులు ఆ చెట్టు వద్దకు వెళ్లి చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

● ఆంధ్రజ్యోతి, భూదాన్‌పోచంపల్లి

మొర ఆలకించండి

యూరియా కొరత రైతన్నలను కంట తడిపెట్టిస్తోంది. రేయింబవళ్లు శ్రమించి, ప్రాణం పెట్టి సాగు చేసిన పంటలు యూరియా లేక దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. జూన్, జూలై మాసాల్లో తగినన్ని వర్షాలు లేవు, ఆగస్టు, సెప్టెంబరులో భారీ వర్షాలు కురిశాయి. ఇప్పటికీ కురుస్తున్నాయి. ఆగస్టులో కురిసిన వర్షాలకు డ్రమ్ము సీడర్‌తో వరి సాగు చేశారు. ఆలస్యంగా సాగు చేసిన పత్తి పూత, కాత దశలో ఉంది. ఇప్పుడు ఇటు వరికి, అటు పత్తికి యూరియా వేయాల్సిన అవసరముంది. ఈ తరుణంలో యూరియా దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)



నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో యూరియా కోసం బారుతు తీరిన రైతులు

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వెంటాడుతున్న యూరియా కొరత
- పంటల దిగుబడిపై ప్రభావం
- పత్తి, వరి పంటలకు యూరియా అందించాల్సిన తరుణం
- డిమాండ్‌కు తగిన సరఫరా చేస్తున్నామంటున్న అధికారులు

సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక పలువురు రైతులు ఆలస్యంగా పత్తి, వరి సాగు చేశారు. ఆగస్టులో కురిసిన వర్షాలకు అలుకుడు, డ్రమ్ము సీడర్ పద్ధతిలో వరి సాగు చేశారు. ఆలస్యంగా సాగు చేసిన పత్తి పూత, కాత దశలో ఉంది. వరికి కూడా ఇప్పుడు యూరియా వేయాల్సి తరుణమంటున్నారు. వర్షాలకు ఎర్రబారుతున్న పత్తి చేలకు కూడా పచ్చబడాలని రైతులు యూరియా వేస్తున్నారు. దీంతో యూరియా వాడకం పెరిగింది. గతంలో లాగా రైతులు భూముల్లో పశువుల పెంట లాంటి సేంద్రియ ఎరువులు వేయడం లేదు. దాంతో భూముల్లో సారం లేకుండా పోయింది. కాంప్లెక్స్ ఎరువులు, యూరియా వేస్తేనే ఏ పంటైనా పచ్చబడుతుంది, ఏపుగా పెరుగుతుంది. వరికి నాటు వేసిన 30రోజుల్లోపు ఒకసారి, కలుపు తీశాక 60 రోజులలోపు రెండోసారి, చిరుపొట్ట దశలో పొటాష్‌తో కలిపి మూడో సారి యూరియా వేస్తున్నారు. పత్తి పంటలకు కూడా రెండు, మూడు దశల్లో యూరియా వేస్తున్నారు. ఆలస్యంగా సాగు చేసిన వరి, పత్తి పంటలకు ఇప్పుడు యూరియా వేయాల్సిన తరుణం. సకాలంలో యూరియా వేయకుంటే పంటలు ఎర్రబారి దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

యూరియా కొరతపై భిన్న వాదనలు

రైతుల అవసరాలకు తగినంత యూరియా సరఫరా చేయకపోవడంతో కొరత ఏర్పడిందని రైతులు ఆరోపిస్తుండగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పంటల సాగు విస్తీర్ణానికి అవసరమైన డిమాండ్ మేరకు యూరియా సరఫరా అవుతున్నదని, కొరత ఎందుకు వస్తుందో అర్థం కావడం లేదని వ్యవసాయ శాఖ అధికారులు తలలు పట్టుకుం టున్నారు. కొందరు రైతులు అవసరానికి మించి యూరియా పంటలకు వేస్తున్నారని, మరికొందరు రైతులు యూరియా కొరత ఇప్పుడే ఇలా ఉంటే రానున్న యాసంగి సీజన్‌లో ఇంకెంత కొరత ఉంటుందోనని, అడ్వాన్సుగా కొని పెట్టుకుంటున్నారన్న అనుమానాలను అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ విస్తీర్ణం(ఐదు, పది, ఇరువై ఎకరాలు) పత్తి సాగు చేసిన రైతులకు యూరియా వచ్చినప్పుడు రెండు బస్తాలు సరిపోదని, అందుకే యూరియా వచ్చినప్పుడల్లా వచ్చి లైన్లో నిలబడాల్సి ఇస్తున్నదని రైతులు అంటున్నారు. సందట్లో సడేమియా అన్నట్టు ఈ గోలలో భూములు సాగు చేయని వారు కూడా కొందరు ఎక్కువ ధరకు విక్రయించుకోవచ్చన్న దురాలోచనతో తీసుకెళ్లుతుండవచ్చన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆధార్‌కార్డు తెచ్చి చూపినప్పుడు సంఘాల సిబ్బంది గాని, దుకాణాల యజమానులు కాని కాదనలేకపోతున్నారంటున్నారు.

నానో యూరియా అందుబాటులో ఉన్నా...

నానో యూరియా అందుబాటులో ఉన్నా రైతులకు దానిపై సరైన అవగాహన లేక వాడటం లేదు. యూరియాకు బదులుగా నానో యూరి యా వాడవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. బస్తాల్లో వచ్చే యూరియా కన్నా నానో యూరియా పిచికారీ చేస్తే చేలకు ఎక్కువ ప్రయోజనం ఉంటుందంటున్నారు. వరికి పొలంలో దిగుబాటులోకి దిగి పిచికారీ చేయడం కొంత కష్టమైనప్పటికీ, పత్తి చేలకు పిచికారీ చేసుకోవచ్చుకదా అంటున్నారు. నానో యూరియా ధర కూడా తక్కువగానే ఉంది. రైతులు నానో యూరియాపై అవగాహన పెంచుకుని పిచికారి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.

పది రోజులుగా తిరుగుతున్నా



నేను నాలుగు ఎకరాలు వరి, పది ఎకరాల్లో పత్తి పంట వేశాను. అధిక వర్షాలకు ఆరు ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. దాన్ని వదిలేశా. నాలుగు ఎకరాల పత్తికి రెండో పర్యాయం, నాలుగు ఎకరాల వరిలో ఎకరమున్నర వరికి మొదటి సారి, రెండున్నర ఎకరాలకు రెండో సారి యూరియా వేయాలి. ఎనిమిది బస్తాల యూరియా అవసరముంది. పది రోజులుగా తిరుగుతున్నా. యూరియా వచ్చిందని తెలియగానే నేను అక్కడకు వెళ్లే సరికే అయిపోయిందంటున్నారు. యూరియా కోసం తిరుగుతూనే ఉన్నా.

- మర్రి వెంకన్న, రైతు, జామచెట్ల బావి

డిమాండ్‌కు తగిన సరఫరా...

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో 3,20,544 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అందులో ప్రధానంగా వరి 2,06,523 ఎకరాలు, పత్తి 1,07,710 ఎకరాలు. జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణానికి ఈ నెలాఖరు వరకు 21 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముండగా ఇప్పటికి 20,100 మెట్రిక్ టన్నుల యూరియా అందించామని వ్యవ సాయ శాఖ జిల్లా అధికారి వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ నెలాఖరు వరకు 900 మెట్రిక్ టన్నులు యూరియా అందించాల్సి ఉందన్నారు. నల్లగొండ జిల్లాలో వరి 5.38 లక్షల ఎకరాలు, పత్తి 5.67 లక్షల ఎకరాలు సాగైంది. జిల్లాకు నెలాఖరు నాటికి 70 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటికి 60 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్టు వ్యవసాయ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఆగస్టు వరకు సరఫరా కొంత తక్కువగా ఉన్నప్పటికీ సెప్టెంబరులో సరఫరా ఎక్కువగానే జరిగిందన్నారు. ఇప్పటికీ సరఫరా కొనసాగుతూనే ఉందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. రైతులు మోతాదుకు మించి యూరియా వాడవద్దని, అలా వాడినా పంటలకు ప్రయోజనముండదన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో రైతులు ఆదివారం యూరియా కోసం పడిగాపులు కాశారు. రైతులు పెద్దసంఖ్యలో రావడంతో ఎస్ఐ అజ్మీరా రమేష్, ఏవో జానకిరాములు సాగర్ రోడ్డులోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు వద్ద రైతులను క్యూ లైన్‌లో ఉంచి ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున టోకెన్లు ఇచ్చారు. పట్టణంలోని మూడు ఫర్టిలైజర్ దుకాణాలకు 20 టన్నులు దాదాపుగా 440 బస్తాల యూరియా రావడంతో రైతులకు ఇచ్చిన టోకెన్లపై ఆ షాపు పేరు రాసి ఇవ్వగా రైతులు అక్కడికి వెళ్లి యూరియా తీసుకున్నారు. మిగిలిన 350 మంది రైతులకు మళ్లీ లోడ్ వచ్చాక పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. యూరియా కోసం నాంపల్లి, చింతపల్లి, పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి, పెద్దవూర, గుర్రంపోడు డిండి, దేవరకొండ, నేరెడుగొమ్ము, చందంపేట మండలాల నుంచి కూడా కూడా రైతులు కొండమల్లేపల్లికి వస్తున్నారు.

అధిక ధరకు విక్రయిస్తున్నారని..

మోతె: సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని సహకార సొసైటీలో రూ.267 విక్రయించాల్సిన యూరియా బస్తా రూ.300 వసూలు చేస్తున్నారని సిరికొండ గ్రామానికి చెందిన ఓ రైతు సెల్‌ఫోన్‌లో తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సహకార సొసైటీలో ఎంత యూరియా వచ్చింది వాటికి సంబంధించిన బిల్లుల వివరాలను అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రశీదులో సిబ్బంది పూర్తిస్థాయి వివరాలు రాయకుండా విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

కోర్సుల భారం

(5వపేజీ తరువాయి)

విద్యార్థులతో ప్రారంభమై ప్రస్తుతం 22 కోర్సులతో కొనసాగుతోంది.అయితే 70మంది టీచింగ్ స్టాఫ్‌కు కేవలం 35మంది మాత్రమే ఉన్నారు. 46 మందిని కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకున్నారు. 2008లో తొలిసారిగా యూనివర్సిటీలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. అంతకు ముందు జిల్లా సమీపంలో పానగల్లులో యూనివర్సిటీని నిర్వహించగా, 2012లో అన్నెపర్తిలోని క్యాంపస్‌కు మార్చారు. ల్యాబ్‌లు మాత్రం ఇప్పటికీ పానగల్‌లోని భవనంలోనే కొనసాగుతనాయి. ఇప్పటి వరకు ద్వితీయ, తృతీయ నాలుగో సంవత్సరానికి సంబంధించిన ల్యాబ్‌లను యూనివర్సిటీకి మార్చలేదు. ఇది ఖర్చుతో కూడుకున్న పని అని యూనివర్సిటీ భావిస్తుండగా, ల్యాబ్‌ను మార్చకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా వచ్చే మరో ఐదు కోర్సులు ఫార్మసీ, ఎల్ఎల్‌బీ, స్పెషల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, గవర్నెర్స్(ఎంఎ)కు ప్రతిపాదనలు పంపగా, ఎల్ఎల్‌బీ, ఫార్మసీ కోర్సులకు అనుమతి వచ్చింది. బడ్జెట్ కేటాయింపులు జరగలేదు. ఎల్ఎల్‌బీ కోర్సును మూడేళ్లతో పాటు ఐదేళ్ల నిర్వహించాల్సి ఉంటుంది.

మెస్ చార్జీలపై గందరగోళం

వాస్తవానికి యూనివర్సిటీలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మెస్ నిర్వహించాల్సి ఉంది. విద్యార్థులే మెస్ నిర్వహించుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో విద్యార్థి మెస్‌చార్జి కింద రూ.1,500 చెల్లించగా, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2,100కు పెంచింది. ఈ మెస్‌చార్జిలు సకాలంలో విడుదల కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. యూనివర్సిటీలోని ఆర్ట్స్, కామర్స్, సైన్స్, బీటెక్‌కు సంబంధించి నాలుగు బ్లాక్‌లో మొత్తం 2,500మంది విద్యార్థుల వరకు విద్యను అభ్యసిస్తున్నారు. యూనివర్సిటీ హాస్టళ్లలో 800మంది విద్యార్థినులు, 800మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. గతంలో పలుమార్లు మెస్‌లో విద్యార్థులు ఘర్షణ పడ్డారు. మెస్‌లో సరైన సౌకర్యాలు కల్పించడం లేదని విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. అదేవిధంగా యూనివర్సిటీలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు సైతం అధ్వానంగా ఉన్నాయి. కనీస నిర్వహణ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు చెబుతున్నారు. మెస్ చార్జీ డిపాజిట్‌గా యూనివర్సిటీ ఒక్కో విద్యార్థి నుంచి రూ.10వేలు వసూలు చేస్తోంది. వాస్తవానికి రూ.5వేలు మాత్రమే డిపాజిట్‌గా తీసుకోవాలి. యూనివర్సిటీలో ప్రొఫెసర్లు క్వార్టర్లలో నివాసం ఉండటం లేదని, వారు అందుబాటులో లేనప్పుడు పరిశోధనలు ఎలా చేయాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. దీంతో పాటు గ్రంథాలయం నుంచి విద్యార్థులు పుస్తకాలు తీసుకెళ్లకుండా సర్క్యులర్ జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది. అత్యవసర ప్రాతిపాదికన ఆరుగురు ప్రొఫెసర్లను నియమించగా, అందులో ఒక్కరు మాత్రమే విధుల్లో చేరారు. మరొకరు విధుల్లో చేరితే కొంతవరకు బోధన మెరుగుపడే అవకాశం ఉంది.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



యూనివర్సిటీలో సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులతో విద్యార్థులపై భారం పడుతోంది. దీంతో పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 12 సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులకు కూడా ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించాలి. యూనివర్సిటీలో సమస్యలను అధికారులు పరిష్కరించాలి. అదేవిధంగా రెగ్యులర్ టీచింగ్ స్టాఫ్‌ను వెంటనే నియమిస్తే బోధన మెరుగుపడుతుంది. విద్యార్థులకు 75శాతం హాజరు నిబంధన ఎంతో ప్రయోజనకరమైనది. నైపుణ్యాలను పెంచే అదనపు కోర్సులను యూనివర్సిటీలో ప్రారంభించాలి. జిల్లా కేంద్రంలోని పానగల్‌లో ఉన్న ల్యాబ్‌లను వెంటనే యూనివర్సిటీకి మార్చాలి.

● వాడపల్లి నవీన్, ఎంజీయూ విద్యార్థి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న టీపీటీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్

చండూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. చండూరులో ఆదివారం జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులను మధ్యలోనే ఆపేసేందుకు కంకణం కట్టుకుందని, విద్యారంగాన్ని విస్మరిస్తుందని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం విద్యారంగాన్ని మతోన్మాద కాషాయీకరణ కోసం నూతన జాతీయ విద్యా విద్యా విధానాన్ని బలవంతంగా అన్ని రాష్ట్రాలపై రుద్దుతుందని ఆరోపించారు. విద్యా రంగంలోకి మూఢనమ్మకాలు, మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా బీజేపీ ఇలాంటి సంస్కరణలు తీసుకురావడం దారుణమన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ముల్కలపల్లి రాములు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నేటికీ విడుదల చేయలేదని విర్శించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సమ్మెకు పోవడం, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో మార్పుకోసం విద్యార్థి లోకం ఎదురు చూస్తుందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారంకై విద్యార్థులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, భరత్, కుర్ర సైదానాయక్, కుంచం కావ్య, స్పందన, బుడిగ వెంకటేశ్, కోరె రమేష్, ముస్కు రవీందర్, మారుపాక కిరణ్, నవదీప్, వీరన్న, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

26 గేట్ల ద్వారా కొనసాగుతున్న సాగర్ నీటి విడుదల

● ఎగువ నుంచి 2,39,978 క్యూసెక్కుల రాక ● దిగువకు 3,22,089 క్యూసెక్కులు విడుదల



నాగార్జునసాగర్ 26 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రం 588.40 అడుగులు వద్ద ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 588.40 అడుగులుగా (307. 2834 టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9,500 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 3,090 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 32,927, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, 26 క్రస్ట్‌గేట్లల్లో 16 క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి, 10క్రస్ట్ గేట్లను 10అడుగుల మేరకు ఎత్తి 2,73,872 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 3,22,089 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 2,29,978 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

మూసీకి కొనసాగుతున్న వరద

కేతేపల్లి: ఎగువ మూసీ నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ ప్రాజెక్టుకు వరద తాకిడి కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరంతా దిగువన గల మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో శనివారం 8823.77క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం మరింత పెరిగి 9510.93క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో శుక్రవారం నుంచి 2, 3, 4, 5, 6, 7, 8, 10నెంబరు క్రస్టుగేట్లను రెండు అడుగులు ఎత్తి వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. క్రస్టుగేట్ల ద్వారా 10406.16క్యూసెక్కుల వరద దిగువ మూసీకి విడుదలవుతోంది. మరోవైపు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 434.16క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.78అడుగులు(4.14టీఎంసీ)లుగా ఉంది.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి



కొండపైన ఉత్తర తిరువీధుల్లో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో యాదగిరికొండపై సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ఉభయ (ప్రత్యేక, ధర్మదర్శనం) క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తజనుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు అరగంట, ధర్మదర్శనాలకు గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. కొండపైన బస్టాండు ప్రాంగణంలో వాహనాలు నిండిపోయాయి. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రాకార మండపాలు, ప్రసాద విక్రయశాల వద్ద కూడా రద్దీ నెలకొనగా ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫోటోలకు పోటీ పడ్డారు. వాతావరణ మార్పులతో ఉక్కపోత నెలకొని భక్తులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. భక్తులను కొండపైకి తరలించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 35,40,126 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్టలోనూ స్వామిఅమ్మవారలకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. స్వామివారిని ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకున్నారు. అర్చకులు ఆలయంలోకి పూలమాల వేసి స్వాగతం పలికారు. ధ్వజస్థంభానికి మొక్కి గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభిముఖంగా పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు

యోగా మానవ జీవితంలో భాగం

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యోగా నేటి మానవ జీవితంలో ఒక భాగమని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన 12వ సీనియర్ అంతర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించారు. పలు జిల్లాల నుంచి వచ్చిన యోగా క్రీడాకారులు తమ విన్యాసాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ యోగా వల్ల, శారీరక దారుఢ్యమే కాకుండా మానసిక వికాసం, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. యోగాతో అనేక రుగ్మతలను నయం చేసుకోవచ్చని తెలిపారు. యోగా శిక్షణా తరగతులను ప్రాథమిక విద్యా తరగతుల నుండే తప్పనిసరి చేయాలని, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, పాఠశాలలు కళాశాలలో యోగ గురువులను ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాలను ప్రాధాన్యతలోకి తీసుకోవాలని కోరారు. యోగా విన్యాసాల్లో ప్రావీణ్యం ప్రదర్శించిన పలువురికి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ మనోహర్, తెలంగాణ యోగ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం. సుధాకర్‌రెడ్డి, డాక్టర్ పుల్లారావు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరిగిరి వెంకట్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సింగం రామ్మోహన్, యోగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు చేస్తున్న విద్యార్థినులు

సెప్టెంబరు 17న ప్రజలు తమ ఇళ్లపై..

జాతీయ జెండా ఎగురవేయాలి



బీబీనగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం సిద్ధఇంచిన సెప్టెంబరు 17న తెలంగాణ ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న ఆ రోజును అవకాశవాదుల రాజకీయ నాయకులు విద్రోహదినమని కొందరు, విలీన దినమని మరికొందరు వాదిస్తూ ఒక మౌలిక అంశాన్ని విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. భూస్వామ్య రాచరిక అరాచక నిజం రాజు ప్రజా స్వామిక వాది ఎలా అవుతాడో రాజకీయ నాయకులు చెప్పాలని ప్రశ్నించారు. నాటి నిజాం పాలనలో భూస్వామ్య సమాజం, హేయమైన వెట్టి చాకిరీ, దోపిడీ, అప్రజాస్వామిక ధరణులకు తెలంగాణ వేదిక అయిందని, పటేల్ పట్వారి భూస్వాములు ఏది చెబితే అదే చెలామణి అయ్యేదని పేర్కొన్నారు. హైదరాబాద్ కాంగ్రెస్ ఇటు కమ్యునిస్టు పార్టీ పోరాడింది నిజాం నుంచి విముక్తి పొందడం కోసమేనని పేర్కొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన.. శ్రీలతకు ప్రశంసాపత్రం



అవార్డు అందుకుంటున్న వీరవెల్లి శ్రీలత

నేరేడుచర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఇంపాక్ట్ క్లబ్ నేరేడుచర్ల హరివిల్లు శాఖ యాంటీ నార్కోటిక్స్ సోల్జర్ వీరవల్లి శ్రీలత తెలంగాణ ఈగల్ ఫోర్స్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ హైదరాబాద్‌లో నిర్వహించిన యాంటీ నార్కోటిక్స్ అవగాహన కార్యక్రమంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే నష్టాలు, యువత బానిస అవుతున్న అంశాలపై ప్రచారం నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించే సదస్సులు నిర్వహించినందుకు అవార్డు లభించింది. ఇంపాక్ట్ ఫౌండర్ గంపా నాగేశ్వరరావు నుంచి అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సంతోష్ కుమార్, యాంటీ నార్కోటిక్ ఇన్‌చార్జి వీరమల్ల శ్రీధర్, అడ్వయిజర్ శ్రీనివాస్, సోను, రామచంద్రుడు, మమత తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని..



భవాని(ఫైల్)

మునుగోడు రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మునుగోడు మండలం చల్మెడ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంక భవాని(25) పదో తరగతి వరకు చదువుకొని, చదువు మానేసి ప్రస్తుతం ఆమె తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనికి వెళ్తుంది. ఈ నెల 8వ తేదీన భవానిని ఆమె తల్లి శోభ బావి వద్దకు రావాలని చెప్పింది. భవాని రాకపోవడంతో మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన భవాని గడ్డి మందు తాగింది. మూడు రోజులు పాటు జ్వరంతో బాధపడగా, 11వ తేదీన చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. భవాని తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇరిగి రవి తెలిపారు.

చండూరు డిగ్రీ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

చండూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దోస్త్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 15,16 తేదీల్లో చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు. జీవో రిజర్వేషన్ల ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని, అర్హులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

యువశక్తి యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

చిట్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీలోని పదో వార్డుకు చెందిన యువశక్తి యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సిలివేరు శేఖర్, అధ్యక్షుడిగా ఐలాపురం నరేష్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శి మద్ది మధు, కార్యనిర్వహణ అధ్యక్షుడు గుండ్లపల్లి వెంకన్న, కార్యదర్శి చింతపల్లి ప్రవీణ్, సహాయ కార్యదర్శి గూడ సాయికిరణ్, కోశాధికారిగా సిలివేరు పరమేష్ ఎన్నికయ్యారు.

భయం.. భయం..

- బీటలు వారుతున్న ఏవో కార్యాలయం
- ఎప్పుడు కూలుతుందో తెలియని గోడలు
- గోడల పగుళ్లలోకి చేరుతున్న సర్పాలు
- కనీస మరమ్మతులకు లేని నిధులు



నార్కట్‌పల్లిలోని వ్యవసాయశాఖ కార్యాలయ భవనం, మెట్లకు ఆనుకుని ఉన్న గోడకు వచ్చిన బీటలు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం భవనానికి పలుచోట్ల బీటలు వారాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందోనన్న భయం అటు కార్యాలయ ఉద్యోగులు... కార్యాలయానికి వచ్చే రైతుల్లో వ్యక్తమవుతోంది. కనీస మరమ్మతులు చేయించడానికి కూడా నిధులు లేకపోవడం ప్రత్యామ్నాయం కూడా లేక చేసేదేమీ లేక భయం ఉన్న భవనంలోనే ఎలాగోలా నెట్టుకొస్తున్నారు. కార్యాలయం పక్కనే రైతువేదికను నిర్మించినా అది సమావేశాలకే పరిమితమవుతోంది. సుమారు 20సంవత్సరాల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ భవనాన్ని ప్రారంభించారు. అప్పటి హౌజింగ్ శాఖ నమూనా మేరకు ఈ భవనాన్ని నిర్మించారు. భవనంలో కింద హాలు మాత్రమే ఉంది. గదులు లేవు.

హాలులోనే టేబుళ్లు కుర్చీలు వేసుకుని ఏవోతో పాటు ఏఈవోలు కూర్చుని విధులు నిర్వహిస్తున్నారు. భవనంపైన ఉన్న గదిలో మట్టి నమూనా సేకరణ పరీక్షలు తదితర సామగ్రిని నిల్వ ఉంచారు. కాగా భవన నిర్మాణంలో నాణ్యత లోపించడంతో భవనానికి పలు చోట్ల బీటలు వారి ప్రమాదం పొంచి ఉంది. భవనం బేస్‌మెంట్, మొదటి అంతస్థు మెట్ల మార్గం, కార్యాలయ ప్రవేశ ద్వారం మెట్లకు ఆనుకుని కట్టిన గోడలకు భారీ పగుళ్లు ఏర్పడుతున్నాయి. బీటలు వారి పెద్దవిగా ఉన్న పగుళ్ల మధ్యలో సర్పాలు చేరి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

మరమ్మతులు చేయించాలి



నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయానికి కనీస మరమ్మతులు చేయించాలి. వ్యవసాయ సీజన్‌లో వందల మంది రైతులు కార్యాలయానికి వివిధ పనుల కోసం వస్తున్నారు. అదృష్టం కొద్దీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కానీ భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో బీటలు వారిన గోడలతో ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలి. కనీస మరమ్మతులు చేయించాలి.

- దుబ్బాక శ్రీధర్, మాజీ వార్డుసభ్యుడు, నార్కట్‌పల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



వ్యవసాయ శాఖ కార్యాలయ భవనానికి చాలా చోట్ల బీటలు వారాయి. కనీస మరమ్మతులు చేయించడానికి శాఖా పరంగా మాకు ఎలాంటి నిధులు రా(లే)వు. ప్రజాప్రతినిధులే స్పందించి తమ కోటా నిధుల కింద భవనానికి కనీస మరమ్మతులు చేయించాలి. భవనం గోడల పగుళ్లలో పాములు చేరుతున్నాయి. ఈ సమస్యను తమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

- కె. గౌతమ్, ఏవో నార్కట్‌పల్లి

రోడ్డుపై మురుగు నీరు

● దుర్గంధంతో ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు



శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో మురుగునీరు

శాలిగౌరారం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం నుంచి మాదారం వెళ్లే ప్రధాన రోడ్డులో ఊట్కూరు గ్రామంలోని మెయిన్‌రోడ్డుపై మురుగునీరు పారుతోంది. ఈ మురుగు నీటి వల్ల దుర్గంధంతో పాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. దీంతో అటు ప్రయాణికులు, ఇటు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు వెళ్తుంటాయి. ఈ ప్రాంతానికి వచ్చే సరికి ఎవరైనా ముక్కు మూసుకోవాల్సిందేనని పలువురు వాపోతున్నారు. ఈ రోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉంటుంది. ఈ సీసీ రోడ్డుకు మురికికాల్వలు లేకపోవడంతో సమీప ఇళ్లకు చెందిన వారు వర్షం నీరు, మురుగు నీరు రాకుండా మట్టి కట్టలు పోయడం వల్ల ఇక్కడ నీరు నిలిచి దుర్గంధంగా మారుతుంది. వానాకాలం నేపథ్యంలో ఈగలు, దోమల వల్ల అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు మేల్కొని ఈ రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

29న సద్దుల బతుకమ్మ
2న దసరా నిర్వహించుకోవాలి

శాలిగౌరారం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం బ్రాహ్మణమిత్ర బృందం ఆధ్వర్యంలో రామడుగు వెంకట్రామశర్మ అధ్యక్షతన సమావేశమై పండుగ తేదీలను నిర్ణయించారు. ఈ నెల 21న ఆదివారం ఎంగిలిపువ్వు బతుకమ్మ, 22 సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం, 29న సోమవారం సద్దుల బతుకమ్మ పండుగ, అక్టోబరు 2న గురువారం విజయదశమి (దసరా) పండుగ చేయుటకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రజలు ఈ పండుగలను పై తేదీలలో ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణులు, పురోహితులు వావిలాల వేణునాధశర్మ, వావిలాల రామలింగయ్య శర్మ, కొడవటిగంటి సుబ్రహ్మణ్యశర్మ, కొండగడప వెంకటేశ్వరశర్మ, వావిలాల లక్ష్మీప్రసాద్‌శర్మ, ఇనుగంటి లక్ష్మి నరసయ్యశర్మ, అమ్మనబోలు వెంకటేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం నేటి తరానికి స్ఫూర్తి



ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న యాదయ్య

నల్లగొండరూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటం నేటి తరానికి స్ఫూర్తి ప్రముఖ కవి రచయిత డాక్టర్ బెల్లి యాదయ్య అన్నారు. పట్టణంలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి అనే అంశంపై ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఆ ట్రస్ట్ కన్వీనర్ డాక్టర్ అక్కెనపల్లి మీనయ్య అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా దొడ్డి కొమరయ్య, చాకలి అయిలమ్మల పోరాటగాథలు నేటి తరానికి పాఠ్యాంశాలు కావాలని ఆకాంక్షించారు. గతాన్ని తెలుసుకోకుండా భవిష్యత్తు నిర్మించలేమని, వాస్తవ తెలంగాణ చరిత్ర తెలుసుకున్నప్పుడే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించగలమని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని నేడు అనేక వక్రీకరణలతో తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతుందన్నారు. దీనిని అడ్డుకొని వాస్తవ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు, రచయితలు మేరెడ్డి యాదగిరిరెడ్డి, ప్రముఖ ఆర్తి కవి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత బైరెడ్డి కృష్ణారెడ్డి, కవి రచతిత అలుగుబెల్లి రామచంద్రారెడ్డి తదితర కవులు తెలంగాణ చరిత్రపై ఆనాడు జరిగిన వాస్తవాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు కుకుడాల గోవర్ధన్, డాక్టర్ మహమ్మద్ హసేన, డాక్టర్ సాగర్ల సత్తయ్య, సిలువేరు లింగమూర్తి, మునాసు వెంకట్, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, పాలడుగు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ

గట్టుప్పల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్లు తెచ్చి కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధానంపై సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు కార్మిక వర్గ పోరాటాలు ఆగవని హెచ్చరించారు. దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి విద్వేష రాజకీయాలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సీఐటీయూ నాయకుడు అచ్చిని బీరప్ప అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు ఏర్పుల యాదయ్య, వరికుప్పల ముత్యాలు, కర్నాటి సుధాకర్, కక్కునూరి రాము, ఏర్పుల సైదులు, ఇడెం వేదావతి, బీమగాని భవాని, రాణి, గంట నరసింహ, దుబ్బాక శంకరయ్య, నర్సింహ, రబ్బాని, వెంకటేశం పాల్గొన్నారు.

విద్యార్థులు
కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

● డీఎస్పీ కొలను శివరాంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందాలని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి సూచించారు. పట్టణంలోని ఎన్ఆర్ఎస్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డేకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పోరాటం చేస్తేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఇంటర్మీడియట్ దశ జీవితాలను మార్చివేస్తుందని ఆలోచనను గమనించి విద్యార్థులు కష్టపడాలని అన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమంగా రాణించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ వేడుకలో ఎస్ఆర్ జూనియర్ కళాశాల, పాఠశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ జోనల్ సతీష్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ మనోజ్ రెడ్డి, ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ ప్రిన్సిపాల్ రూప, డీన్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



హస్తకళ మేళాను ప్రారంభించి పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): చేనేత హస్తకళలను ప్రోత్సహించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. పట్టణంలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ స్టాల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ఎగ్జిబిషన్ ఈనెల 28వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో చేనేత వస్త్రాలు సంబంధించి, పొందూరు, చేబ్రోలు, పోచంపల్లి, పొద్దుటూరు, మంగళగిరి, గద్వాల, చీరాల, ఢిల్లీ, చందేరి, బెంగాలీ, బెనారస్, కోట బాంబే, రెడీమేడ్స్, కలంకారీ, శారీస్ డ్రెస్ మెటీరియల్స్, బెడ్ షీట్స్ తదితరులతోపాటు హస్తకళలకు సంబంధించి కొండపల్లి, ఏటిపాక బొమ్మలు హైదరాబాద్ నుంచి ముత్యాలు, గ్రామ ఉద్యోగ ఆయుర్వేద ఔషధాలు, లెదర్ బ్యాగులు, మైసూర్ రోజ్ ఉడ్ ప్యానల్స్ తదితరాలను ప్రదర్శన, అమ్మకం కోసం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాల్స్ యాజమాని కె.ఉమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, సీనియర్ నాయకులు సింగం రామ్మోహన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, అనిల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీమారంలో ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కేతేపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీమారం గ్రామంలో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఎస్వీఆర్ కిడ్నీ కేర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్యాస్ట్రో, లివర్, న్యూరో, కార్డియాలజీ సంబంధిత వైద్యపరీక్షలు ఉచితంగా చేశారు. గ్రామానికి చెందిన దాదాపు 350 మందికి ఈ వైద్యశిబిరంలో వైద్యులు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. వైద్యశిబిరంలో ఎస్వీఆర్ కిడ్నీ కేర్ సెంటర్ వైద్యులు రాకేష్, అభిషేక్, వివేక్, ఆస్పత్రి మేనేజర్ హర్ష, స్థానిక మాజీ సర్పంచ్ బడుగుల కవిత, కాంగ్రెస్ నాయకులు బి.నరేందర్, జి.నాగరాజు, కోట శ్రీనివాస్, జి.బాలరాజు, ఎం.సురేష్, అర్వ కిరణ, జి.ప్రభాకర్, కె.శ్రవణ్ పాల్గొన్నారు.

చారుమతి చైల్డ్ కేర్ సెంటర్‌లో
వేదశ్రీ పుట్టిన రోజు వేడుకలు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ కుతురు వేదశ్రీ పుట్టిన రోజును ఆదివారం స్థానిక చారుమతి చైల్డ్ కేర్ సెంటర్‌లో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం అల్పాహారాన్ని, నిత్యావసర వస్తువులను అందించారు. ఈ వేడుకల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ శక్తి వాయిస్ అధ్యక్షురాలు సరిత, చైల్డ్ కేర్ నిర్వహకులు నాగసేనారెడ్డి, బకరం వెంకన్న, యాదగిరిగౌడ్, బొమ్మరబోని నాగార్జున, కులుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, అప్పటి విద్యార్థులు

● 20 సంవత్సరాల తర్వాత కలయిక

నల్లగొండరూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల 2004-2005 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని ఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమయ్యారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. వారి గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. 20సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఉత్సాహ పూరితంగా గడిపారు. అంతేకాక వారి కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. అప్పటి మిత్రులు ఉన్నత హోదాల్లో ఉండటం వారికి ఎంతో ఆనందాన్ని కలుగజేసింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజీమ్, భాస్కర్‌రావు, వెంకటేశం, సుదర్శన్, శ్రీనివాస్, నర్సింహ, రవీంద్రాచారి, సూర్యానారాయణ, విద్యార్థులు మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, డి.లింగారెడ్డి, జెరిపోతుల ఉపేందర్, కుకుడాల శ్రీధర్‌రెడ్డి, బైరెడ్డి, క్రాంతి, రామలింగం, సర్వోత్తమ్‌రెడ్డి, రాజు ప్రవీణ్, సైదిరెడ్డి, శ్వేత, పారిజాత, అఖిల, శైలజ, దీపిక, శ్యామల, పుణ్యవతి, పార్వతి, సఫీయా, అనురాధ, జ్యోతి పాల్గొన్నారు.

ప్రధాని జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు వెంకన్న

చిట్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని ఈ నెల 17న ఘనంగా నిర్వహించాలనీ బీజేపీ మండల అధ్యక్షుడు పీక వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు మైల నర్సింహ కోరారు. చిట్యాలలో ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని జన్మదినం సందర్భంగా 15 రోజులు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, దివ్యాంగుల ప్రతిభను గుర్తించి సన్మానం చేయడం, ప్రతీ బూత్‌లో మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా అన్ని పోలింగ్ బూతుల పరిధిలో జాతీయ జెండాలను ఆవిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పున్న విష్ణు, నాయకులు ఆకుల వెంకన్న, గోపాల్‌రెడ్డి, వరికుప్పల నర్సింహ, అశోక్ నరేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త ప్రపంచ మానవాళికి స్ఫూర్తిదాయకం

● వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి



మిలాద్ జులుస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండటౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త ప్రపంచ మానవాళికి స్ఫూర్తిదాయకమని వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం మిలాద్ జులుస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కులమతాలకు అతీతంగా మిలాద్ జులుస్ నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మిలాద్ జులూస్ కమిటీ, పట్టణ ప్రజలకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. మిలాద్ జులుస్ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ మిలాద్ జులూస్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం జన్మదినం సందర్భంగా వారి ప్రేమలో ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలోని పేషంట్లకు, నిరుపేదలకు పండ్లు, పౌష్టికాహారాన్ని అందించారు.

ఈ కార్యక్రమంలో మిలాద్ జులుస్ కమిటీ ప్రెసిడెంట్ సయ్యద్ సల్మాన్‌ఖాద్రి, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఫాజిల్, జనరల్ సెక్రెటరీ సయ్యద్ ఉబేదుల్లా ఖాద్రి, అడ్వైజర్ యండి ఖలీమ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంతియాజ్ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు జమాల్ ఖాద్రి, అడ్వకేట్ మసీయుద్దీన్, మాజీ ఏఐఎంఐఎం జిల్లా నాయకులు అహ్మద్ కలీం, సయ్యద్ లతీఫ్ షావుల్లాఖాద్రి, ముజావర్ సమీ ఖాద్రి, సుఫియా ఖాద్రి, తబరేస్ ఖాద్రి, అవేస్ ఖాద్రి, నసిర్, ఫిరోజ్, ఉమైర్, పుర పట్టణ ప్రముఖులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పోలీసుల ఆత్మీయ సమ్మేళనం

కనగల్, సెప్టెంబరు 14: (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుళ్ల 1983 బ్యాచ్ ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలనాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. తొలుత అమరులైన కానిస్టేబుళ్లను గుర్తుంచేసుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో గౌసుద్దీన్, ఎస్‌కె నజీర్, ఎండీ యూసుఫ్‌జానీ, మధుసూదన్‌రెడ్డి, ఎస్‌కే నజీర్, అబ్దుల్లా, జిలానీ, ఎండీ గౌస్, అచ్యుతం, యాదగిరి, మదఅమృతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 24.0

ANDHRAJYOTHY



నల్లగొండ

5

సోమవారం 15 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.40 (307.2834)	2,39,078	3,22,089
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.78 (4.14)	9,510.93	10,900.54
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.898 (42.5720)	3,12,693	3,19,094

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240



విద్యార్థులపై సెల్ఫ్‌ఫైనాన్స్
కోర్సుల భారం

- 50 శాతం మేర విద్యార్థులే ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి
- 10 కోర్సులకే బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద విద్యార్థులు
- యూనివర్సిటీ సమస్యలపై గవర్నర్ దృష్టి సారించేనా?
- నేడు ఎంజీయూ నాలుగో స్నాతకోత్సవం

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో విద్యార్థులపై సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల భారం పడుతోంది. యూనివర్సిటీలో 22 కోర్సులతో పాటు 18 డిపార్ట్‌మెంట్లు ఉన్నాయి. అయితే ప్రభుత్వం కేవలం 10 కోర్సులకే బడ్జెట్ కేటాయించగా, మరో 12కోర్సులు సెల్ఫ్‌ఫైనాన్స్‌తో కొనసాగుతున్నాయి. ఈ కోర్సులు చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజులు చెల్లించాల్సి వస్తుండటంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది.

– (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)


ఎంజీ యూనివర్సిటీలో సైకాలజీ కోర్సు సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుకు నిర్వహిస్తుండగా, ఫీజు రూ.20వేల వరకు ఉంది. అందులో విద్యార్థులు 50శాతం ఫీజు చెల్లిస్తే ప్రభుత్వం రూ.10వేలు చెల్లిస్తోంది. విద్యార్థి తప్పనిసరిగా రూ.10వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ ఐఎంబీఏ కోర్సుకు రూ.37వేలు ఫీజు ఉండగా, అందులో రూ.20వేలు ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్‌గా చెల్లిస్తే రూ.17వేల వరకు విద్యార్థి ఫీజు కట్టాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీటెక్ ట్రిబుల్‌ఈ, సీఎస్‌ఈ, ఈసీవంటి సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులకు రూ.57,200 వరకు ట్యూషన్ ఫీజు ఉంది. అందులో ప్రభుత్వం రూ.35వేలవరకు చెల్లిస్తుండగా, మరో రూ. 22,200 విద్యార్థులు చెల్లించాలి. 2007లో ప్రారంభమైన ఎంజీ యూనివర్సిటీ నాలుగో స్నాతకోత్సవానికి సిద్ధమైం ది. 2017, 2018, 2019లో స్నాతకోత్సవాలు నిర్వహించిన యూనివర్సిటీ తాజాగా, ఈనెల 15న నాలుగో స్నాతకోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. ఈ స్నాతకోత్సవానికి యూనివర్సిటీల కులపతి, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రానున్నారు. ప్రస్తుతానికి యూనివర్సిటీ బీ+ గ్రేడ్‌లో ఉండగా, 2028 నాటికి న్యాక్ అక్రిడేషన్‌లో ఏ+ గ్రేడ్‌కు చేరుకోవాలని యత్నిస్తోంది. ఈ నేపథ్యంలో సమస్యలు అధికంగా ఉన్నప్పుడు ఎలా సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

టీచింగ్ స్టాఫ్ అరకొరగానే..

యూనివర్సిటీ 2007లో ఆరుకోర్సులతో 500మంది

– మిగతా 7వ పేజీలో...

నేడు ఎంజీయూకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



నల్లగొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో ఈ నెల 15న జరిగే నాలుగో స్నాతకోత్సవానికి గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి జిష్ణుదేవ్‌వర్మ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నా రు. ఆయనతోపాటు హైదరాబాద్‌లోని ఐఐటీ డైరెక్టర్ బీఎస్‌మూర్తి స్నాతకోత్సవ ఉపన్యాసం చేయనున్నారు. ఈ స్నాతకోత్సవంలో 22 మందికి పీహెచ్‌డీలు, 53 మంది పీజీ విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేయనున్నారు. డిగ్రీ, పీజీ, బీఈడీ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నారు. ఎంజీయూలో స్నాతకోత్సవ ఏర్పాట్లను ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, సీఈవో ఉపేందర్‌రెడ్డి ఆదివారం పర్యవేక్షించారు.

గవర్నర్ షెడ్యూల్ ఇలా

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ నెల 15న 9 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి రోడ్డుమార్గంలో ఎంజీయూనివర్సిటీకి 10.45కి చేరుకుంటారు. 11నుంచి 12.30గంటల వరకు ఎంజీయూ స్నాతకోత్సవంలో ప్రసంగం,విద్యార్థులకు బంగారు పతకాలను, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారు. మధ్యాహ్న భోజనం, విశ్రాంతి అనంతరం 2గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కు చేరుకొని అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. 3.15గంటలకు కలెక్టరేట్ నుంచి హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో వెళ్తారు.



యూరియా కోసం మోత్కూరులో బారులుదీరిన రైతులు (ఫైల్)

మొర ఆలకించండి

- ఉమ్మడి జిల్లాలో వెంటాడుతున్న యూరియా కొరత
- పంటల దిగుబడిపై ప్రభావం
- పత్తి, వరి పంటలకు యూరియా అందించాల్సిన తరుణం
- డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేస్తున్నామంటున్న అధికారులు

యూరియా కష్టాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. రేయింబవళ్లు శ్రమించి సాగు చేసిన పంటలు యూరియా లేక దెబ్బ తింటున్నాయని ఆవేదన చెందుతున్నారు. జూన్, జూలై మాసాల్లో తగినన్ని వర్షాలు లేవు. ఆగస్టు, సెప్టెంబరులో భారీ వర్షాలు కురిశాయి. ఇప్పటికీ వర్షాలు కురుస్తున్నాయి. ఆగస్టులో కురిసిన వర్షాలకు రైతులు పెద్ద మొత్తంలో వరి సాగు చేశారు. ఆలస్యంగా సాగు చేసిన పత్తి పంట పూత, కాత దశలో ఉంది. అటు వరికి, అటు పత్తికి యూరియా అందించాల్సిన అవసరం పెరిగింది. ఈ తరుణంలో సరిపడా యూరియా అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే అధికారులు మాత్రం డిమాండ్‌కు తగినట్టు యూరియా సరఫరా చేస్తున్నామని చెబుతున్నా, సరిపడా యూరియా అందక ఉమ్మడి జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట రైతులు ఆందోళనలు నిర్వహిస్తూనే ఉన్నారు.

7

– (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

నేటి 'ప్రజావాణి' రద్దు : కలెక్టర్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పలివెల సాయుధ పోరాటాల గడ్డ

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సాయుధ పోరాట యోధుడు కొండవీటి గుర్నాథ్‌రెడ్డి స్థూపం వద్ద పూలమాలలు వేసే నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మునుగోడు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా సాయుధ పోరాటానికి పలివెల గ్రామం అడ్డాగా నిలిచిందని సీపీఐ జిల్లా కార్యద ర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం మండలంలోని పలివెల, కొరటికల్ గ్రామాల్లో నిర్వహించిన సాయుధ పోరాట వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. సాయుధ పోరాట అమరులు కొండవీటి గురునాథరెడ్డి, కొండవీటి బచ్చిరెడ్డి, కొండవీటి జగన్మోహన్‌రెడ్డి, మిరియాల లింగయ్య, అంజయ్య స్థూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జెండాను ఆవిష్కరించి మా ట్లాడారు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పలివెల గ్రామం కొండవీటి కుటుంబం పోరాటాలు నిర్వహించిందన్నారు. బచ్చిరెడ్డి, గుర్నాథ్‌రెడ్డి, గోస్కొండ పెద్దులు మరో 30మంది పోరాట యోధులు నిజాంకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. సాయుధ పోరాటం లో నిరుపేద ప్రజలకు 10 లక్షల ఎకరాల భూ మిని పంచిపెట్టిన ఘనత కమ్యూనిస్టులదని అన్నారు. కార్యక్రమంలో అమరుల కుటుంబ సభ్యులు కొండవీటి సునీల్ రెడ్డి, కొండవీటి రవీందర్‌రెడ్డి, కొండవీటి సురేందర్‌రెడ్డి, కొండవీటి శేఖర్‌రెడ్డి, సీపీఐ నాయకులు గురుజ రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు, బోలుగురి నరసింహ, నురిగి చలపతి, చాపల శ్రీను, మందుల పాండు ఉప్పునుతుల రమేష్, మాజీ జడ్పీటీసీ గోస్కొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాదగోని సాయిలు, ఆనగంటి నరసింహ, తిరుమల యాదయ్య పాల్గొన్నారు.

- రెట్టింపునకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ
- హైదరాబాద్ శివారు ప్రాంతాలపై దృష్టి
- పరిశ్రమలు, టూరిజం అభివృద్ధిపై నజర్
- విధివిధానాలు రూపొందిస్తున్న అధికారులు
- ఆర్‌ఆర్‌ఆర్ సమీపంలోకి పరిశ్రమల తరలింపు?
- జిల్లాల్లో నూతన పారిశ్రామికవాడలు

ఆదాయం పెంచేద్దాం!

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే నిధులు అవసరం. దీంతో ఆదాయ వనరులను పెంచుకుని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ప్రధానంగా కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, గనులు, రిజిస్ట్రేషన్ల శాఖలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఆదాయ వనరుల సమీకరణ, లక్ష్యాలపై ఇటీవల కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. లక్ష్య సాధనకు అన్ని శాఖలు పక్కా ప్రణాళికలతో ముందుకు సాగాలని సబ్ కమిటీ అధికారులకు సూచించింది.

– (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)



సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని రాష్ట్ర ఆదాయాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అందులో భాగంగా అన్ని శాఖలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న ప్రాంతాల్లో ఆదాయం పెంపుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించే పనిలో నిమగ్నమైంది. ఉమ్మడి జిల్లా నగరానికి చేరువలో ఉండటంతో రియల్ ఎస్టేట్‌తో పాటు ఎక్సైజ్, వాణిజ్య పన్నులశాఖ ద్వారా సర్కారుకు ఆదాయం సమకూరుతోంది. ఆదాయాన్ని మరింతగా పెంచేందుకు హైదరాబాద్ సమీపంలో ఉన్న జిల్లాలో పారిశ్రామికాభివృద్ధితో పాటు టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు సన్నద్ధమవుతోంది.

కీలక శాఖల నుంచి నికరంగా ఆదాయం

వాణిజ్య పన్నులశాఖ ద్వారా యాదాద్రి జిల్లాలో నెలకు రూ.6కోట్ల నుంచి రూ.8కోట్ల మేర పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. ఏటా జిల్లా నుంచి ప్రభుత్వానికి మొత్తంగా రూ.60కోట్ల నుంచి రూ.70కోట్ల మేరకు ఆదాయం వస్తోంది. ఎక్సైజ్‌శాఖ ద్వారా రూ.450కోట్లు, మైనింగ్ శాఖ ద్వారా రూ.5కోట్ల ఆదాయం సమకూరుతోంది. చౌటుప్పల్, యాదగిరిగుట్ట, భువనగిరి బీబీనగర్, రామన్నపేట, మోత్కూరు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో భూముల విక్రయాల ద్వారా రూ.150కోట్ల మేర ఆదాయం వస్తోంది. ఈ శాఖల ద్వారా ప్రభుత్వం మరింత ఆదాయ పెంపునకు ఉన్నతాధికారులు అధ్యయనం చేస్తున్నారు.

నూతన పారిశ్రామిక వాడలు

ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమల తరలింపునకు ప్రభుత్వం విధివిధానాలు రూపొందించే పనిలో నిమగ్నమైంది. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న జిల్లాల్లో నూతనంగా పారిశ్రామికవాడల ఏర్పాటుకు సర్కారు యోచిస్తోంది. రీజనల్ రింగ్‌రోడ్డు వెంట ఇండస్ట్రియల్ జోన్‌లను ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే యాదాద్రి జిల్లాలో భువనగిరి, చౌటుప్పల్, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మండలాల్లో పలు పరిశ్రమలు ఉన్నాయి. టీఎస్ ఐ-పాస్ కింద మొత్తం 1,090 పరిశ్రమలు ఉండగా, వీటి ద్వారా 41,270 మంది ఉపాధి పొందుతున్నారు. టీఐడియా, టీప్రైడ్ పథకాల కింద 796యూనిట్లు మంజూరయ్యాయి. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఎంఎస్ఎంఈ ఏర్పాటైంది. హరిత పారిశ్రామిక పార్కుకు

– మిగతా 6వ పేజీలో...


పండుగ తర్వాతే పనులు

- జాతీయ రహదారుల విస్తరణ పనుల నిర్వహణపై వినతులు
- సహకరించాలంటున్న అధికారులు

8

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



దేవరకొండ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, రైతులకు యూరియా సరఫరలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యూరియా కోసం రైతులు ఉదయం నుంచే పీఏసీఎస్‌ల వద్ద చెప్పులు, పట్టాదార్ పాస్‌పుస్తకాలు క్యూలైన్‌లో ఉంచి గంటలతరబడి ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. రైతులు యూరియా కోసం పనులు మానుకొని పడిగాపులు కాసే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీ మహిళలకు రూ.2500, తులం బంగారం, రూ.4వేల పెన్షన్ ఏమైందని ప్రశ్నించారు. ఢిల్లీ పర్యటనలే తప్ప ప్రజల, రైతుల సమస్యలను సీఎం పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

గిరిజనుల గోడు తీరేనా?

- గుర్రంబోడుతండాలో 540సర్వే నెంబరులో ఉన్నది 1,873 ఎకరాలు
- ఆరు వేల ఎకరాలకు పైగా ఉన్నట్లు చూపి నకిలీ పత్రాల సృష్టి
- బండి సంజయ్ ఆందోళనతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం
- నాటి ఘటనతో నేటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో నిలిచిన రెవెన్యూ సేవలు

6

సాగర్‌లో పర్యాటకుల సందడి



నాగార్జునకొండకు వెళ్లే లాంచీ దిగి వస్తున్న పర్యాటకులు

నాగార్జునకొండకు మూడు ట్రిప్పులు నడిచిన లాంచీలు

నాగార్జునసాగర్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో రెండు రోజులు సెలవు దినాలు కావడంతో పర్యాటకుల సందడి నెలకొంది. సాగర్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, విజయ విహార్, కొత్తవంతెన, ప్రధాన జలద్యుత్ కేంద్రం తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొంకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడు ట్రిప్పులు, జలాశయంలో మరో రెండు జాలీ ట్రిప్పులు లాంచీలు నడిపినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

సాగర్‌ను సందర్శించిన డిప్యూటీ అకౌంటెంట్ జనరల్

ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్‌ను ఆదివారం రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ సంజయ్ కామినేని సందర్శించారు. ఉదయం ఆయన సాగర్ ప్రధాన డ్యాం, గ్యాలరీలను, ఎత్తిపోతల జలపాతాన్ని సందర్శించారు. అనంతరం హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టును తిలకించారు.

అక్కడ చరిత వనం, ధ్యాన వనం, జాతక వనం, స్థూప వనాలను తిలకించారు. మహాస్థూపం లోపల అష్టబుద్ధుల విగ్రహాల వద్ద బుద్ధ జ్యోతిని వెలిగించారు. అనంతరం మహాస్థూపం దిగువన ఉన్న సమావేశ మందిరంలో బుద్ధవనం వీడియోను వీక్షించారు. బుద్ధవనం ఈవో శాసన, మేనుజర్ రవిచంద్రలు ఆయనను పంచశీల కండువాతో సన్మానించారు. సాగర్, బుద్ధవనం విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వారికి వివరించారు. ఆయన వెంట సీనియర్ ఆడిట్ ఆఫీసర్ బ్రిజేస్ కుమార్, సాగర్ డ్యాం డివిజన్ సూపరెండెంట్ దుర్గ ప్రసాద్, ఎస్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

కమ్యూనిస్టుల పోరాటం
చరిత్రాత్మకం

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పరిపాలకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి కమ్యూనిస్టులు జరిపిన మహత్తర పోరాటం చరిత్రాత్మకమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. సాయిధ రైతాంగ పోరాట వార్శికోత్సవాల కార్యక్రమాన్ని సీపీఎం ఆధ్వర్యంలో చిట్యాల మండలం గుండ్రాంల్లిలో నిర్వహించారు. జెండాను సీతారాములు ఆవిష్కరించి మాట్లాడారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని సయ్యద్ మక్బూల్ హింసాకాండను కొనసాగించి, పైశాచికత్వానికి నిదర్శనంగా మారాడన్నారు. రజాకార్ల కబంధ హస్తాల నుంచి ప్రజలను విముక్తి చేయడానికి కమ్యూనిస్టు పార్టీ ప్రజాదళాలు స్వేచ్ఛకోసం నెత్తురును చిమ్మించాయన్నారు. కమ్యూనిస్టుల పోరాటంతోనే రజకార్లు తోకముడిచారన్నారు. రజాకార్ల పాలనకు వ్యతిరేకంగా జరిగిన మహత్తర పోరాటాన్ని మతఘర్షణలుగా బీజేపీ వక్రీకరించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, బొజ్జ చినవెంకులు, మల్లం మహేష్, జిట్ట సరోజ, పెంజర్ల సైదులు, రాచకొండ వెంకటేశ్వర్లు, లూర్దు మారయ్య, కుమ్మరి శంకర్, అరూరి శ్రీను, కత్తుల లింగస్వామి, ఐతరాజు నర్సింహ, పంది నరేష్, కె.యాదయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలి

చందంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొత్త పింఛన్ల సాధన కోసం 15వ తేదీన నిర్వహించనున్న తహసీల్దార్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు శ్రీరామదాసు వెంకటచారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులకు, ఇతరులకు రూ.4 వేలు, పూర్తిస్థాయి దివ్యాంగులకు రూ.15వేల పింఛన్ ఇవ్వాలని కార్యాలయ ముట్టడి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com ● సోమవారం 15 సెప్టెంబరు 2025

యూరియా కొరత తీర్చడంలో విఫలం : వెంకట్‌రెడ్డి

చింతపల్లి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా సరఫరా చేసి, కొరత తీర్చడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయమని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ పని చేశారని ఆయన గుర్తుచేశారు.

వెల్ఫేర్‌బోర్డును కార్మికులు వినియోగించుకోవాలి

దామరచర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న వెల్ఫేర్ బోర్డును కార్మికులు వినియోగించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులు వెల్ఫేర్ బోర్డులో పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేసి ఆదుకోవాలన్నారు. మృతి చెందిన కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, 60 సంవత్సరాలు దాటిన కార్మికులకు పింఛన్లు అందించాలని, ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు కేటాయించాలని కోరారు. అనంతరం భవన నిర్మాణ కార్మిలకు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పల్లా సుదర్శన్, ఉపాధ్యక్షులుగా కొమ్ము రాజేష్, గుండ్లపల్లి ఆంజనేయులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భూక్యా విజయ్, నరేందర్, నరసింహారావు, సైదులు, బ్రహ్మయ్య, రమేష్, రమణమ్మ, గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

దేవరకొండ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదవాలని, చదువుతో పాటు క్రమశిక్షణ, మర్యాద, సహకారం వంటి విలువలు నేర్చుకోవాలని హాస్టల్ వార్డెన్ డాక్టర్ రుణదేవి అన్నారు. దేవరకొండ సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహంలో ఆదివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లల భవిష్యత్తు కోసమే చర్చించడం కోసమే సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, మర్యాద, సహకారం వంటి విలువలు నేర్చుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఉచిత విద్య, పుస్తకాలు, వసతి, ఆహారం, మౌలిక సదుపాయాలను అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. హెల్త్‌అసిస్టెంట్ లింగయ్య మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం సుందరయ్య, ఏఎన్‌ఎం కవిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు అంబరాన్నంటాలి : ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

మిర్యాలగూడటౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలు అంబరాన్నంటాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఈ నెల 17న ఎన్నెస్పీ మైదానంలో నిర్వహించనున్న ఉత్సవ ఏర్పాట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉత్సవ సమితి ఎమ్మెల్యేను ఆదివారం కలిసి ఆహ్వానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, కులమతాలు, పార్టీలకతీతంగా పండుగలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు రాంబో శ్రీను, గాయం ఉపేందర్‌రెడ్డి, చిలుకూరి శ్యాం, దేశిడి శేఖర్‌రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి సారూ



చందంపేట మండలం చిత్రియాల గ్రామంలో చిన్న పూరిగుడిసెలో ఉంటున్న చాట్ల అంకులు

చందంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): చందంపేట మండలం చిత్రియాల గ్రామానికి చెందిన చాట్ల అంకులు (60) ఒక చిన్న పూరిగుడిసెలో నివాసం ఉంటున్నాడు. అతనికి సొంత వ్యవసాయ భూమి కాని, ఇతర ఆదా య వనరులు లేకపోవడంతో భార్యాభర్తలు ఇద్దరూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కూలీ పనులు చేసి నలుగురు కుమార్తెల వివాహాలు చేశారు. ఇల్లు కట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో చిన్న పూరి గుడిసెలో నే కాలం గడుపుతున్నారు. అధిక వర్షాల కారణంగా గుడిసె కురుస్తూ ఇం ట్లోని వస్తువులు, సరుకులు తడిసిపోతున్నాయని ప్రభుత్వం తమలాంటి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

రైతులు ఆందోళన చెందవద్దు

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా గురించి ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయాధికారి గంట హర్షిత అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం మండలానికి కేటాయించిన యూరియాను రైతులకు సకాలంలో అందేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మండలానికి ఆదివారం 80 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ యూరియాను మండలకేంద్రంలోని రైతు వేదికతో పాటు డొక్కలబాయితండాలో గల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం నుంచి రైతులకు పంపిణీ చేశామన్నారు. రానున్న నాలుగు రోజుల్లో రైతులకు సరిపడా యూరియా అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

పండుగ తర్వాతే పనులు..



కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిలో భాగంగా విస్తరించనున్న రోడ్డిదే.

- రోడ్డు విస్తరణపై వినతులు
- సహకరించాలంటున్న అధికారులు

కోదాడ -జడ్చర్ల జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా పట్టణంలో జరుగుతున్న సాగర్ రోడ్డు విస్తరణ పనులకు పండుగలు అడ్డుపడుతున్నట్లు తెలుస్తోంది. దీర్ఘకాలంగా జరుగుతున్న ఈ పనులలో తీవ్రజాప్యం జరుగుతుండగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం నడిబొడ్డు నుంచి జాతీయ రహదారి ఏర్పాటుపై ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చినా మరో మార్గం లేని కారణంగా ఉన్న రోడ్డునే విస్తరిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా ఈదులగూడ నుంచి రైల్వేలేన్ వరకు రోడ్డును 100 అడుగులకు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయితే విస్తరణ కోసం సేకరించే భూముల ధర అధికంగా ఉండటం, ఇళ్లు, దుకాణాలు కోల్పోయే వారి నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో రోడ్డు విస్తరణ ప్లాన్‌లో మార్పులు చేశారు. పలు పర్యాయాలు సవరణలు చేసి పలు ప్రాంతాల్లో విస్తీర్ణాన్ని తగ్గించారు. ఈదులగూడ నుంచి తహసీల్దార్ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి రాజీవ్‌చౌక్, రౌండ్ నుంచి బస్టాండ్, బస్టాండ్ నుంచి రాఘవ థియేటర్, గాంధీ విగ్రహం నుంచి రైల్వేగేటు వరకు విభాగాలుగా విభజించి రోడ్డును విస్తరించనున్నారు. పరిస్థితిని బట్టి కొన్ని చోట్ల 84 అడుగులు (అటు 42, ఇటు 42 అడుగులు), మరికొన్ని చోట్ల 88, 90 అడుగులకు విస్తరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

విజ్ఞప్తుల నేపథ్యంలో..

రోడ్డు విస్తరణ పనులు దసరా, దీపావళి పండుగల అనంతరమే జరగనున్నాయి. అతిపెద్ద పండుగలైన దసరా, దీపావళి సందర్భంగా పెద్దఎత్తున వ్యాపారాలు జరుగుతాయి. విస్తరణలో దుకాణాలు కోల్పోనున్న యజమానులు, వ్యాపారులు స్థానిక ప్రజానేతను కలిసి దసరా, దీపావళి పండుగల అనంతరం తామే కూలగొట్టుకుంటామని, అప్పటి వరకూ పనులను వాయిదా వేయాలని కోరినట్లు సమాచారం. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని విస్తరణలో దుకాణాలు కోల్పోయే యజమానులు తెలిపారు.

మరో కారణమూ లేకపోలేదు..

రహదారి విస్తరణలో జాప్యం నెలకొనడం వెనుక మరో కారణం లేకపోలేదు. ఇళ్లు, వ్యాపార సముదాయాలు కోల్పోతున్న వారికి ఇప్పటి వరకు నష్టపరిహారం రూ.33 కోట్లు అందజేసింది ప్రభుత్వం. మరో రూ.6కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉండగా, ఆయా ఆస్తులు వారసత్వ వివాదాలతో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరిహారం అందుకునే వారిపై స్పష్టత లేద ని, వివాదాలు సద్దుమణిగిన అనంతరం పరిహారం అందజేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

నిబంధనల మేరకు నిర్మించుకోవాలి



రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు తొలగించుకున్న యజమానులు నిబంధనల మేరకు పునర్నిర్మాణాలు చేపట్టాలి. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సెట్ బ్యాక్ తీసుకోవాలి. వాహనాలు పబ్లిక్ ప్రదేశాలు, రహదారులపై నిలపకుండా పార్కింగ్ కోసం స్థలం కేటాయించుకోవాలి. నష్టపరిహారం అందిన యజమానులు త్వరతగతిన నిర్మాణాలు తొలగించి సహకరించాలి.

- శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

పట్టణంలో పచ్చదనం

ఆహ్లాదకరంగా ఎన్నెస్పీ క్యాంపు ప్రాంతం

(మిర్యాలగూడటౌన్, ఆంధ్రజ్యోతి)

పారిశ్రామిక పట్టణంగా పేరొందిన మిర్యాలగూడ పట్టణ నడిబొడ్డున పచ్చదనం పరుచుకుంది. ఏపుగా పెరిగిన వందలాది చెట్లతో నిండుకున్న ఎన్నెస్పీ క్యాంపు పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు ఆహ్లాదం పంచుతోంది. ఇక పిచ్చిక బయళ్లతో నిండిన సుందరయ్య పార్కు ఎన్నెస్పీ క్యాంపుకు మరింత పేరు తెచ్చాయి. విశాలవంతమైన క్రీడామైదానం, సుమారు రెండు వందల అడుగుల ఎత్తయిన బీఎస్‌ఎన్‌ఎల్ టవర్, వంద అడుగుల జాతీయజెండా కూడా అక్కడే ఉంది.



పట్టణంలోని అశోక్‌నగర్ మీదుగా క్యాంపులో కనిపిస్తున్న పచ్చదనమిది

నృత్య ప్రదర్శనలో ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న సిరివెన్నెల

మిర్యాలగూడటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన శ్రీపాద సిరివెన్నెల జాతీయస్థాయి కూచిపూడి పోటీల్లో ఉత్తమ నృత్య ప్రదర్శన చేసి ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా సిరిమువ్వ నాట్యాలయ గురువు కలకొండ రాము మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిలోని తెలుగు యూనివర్సిటీలోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో శ్రీ వేంకటేశ్వర దేవస్థాన ట్రస్టు ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో జాతీయస్థాయి కూచిపూడి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణ నృత్యకారిణి సిరివెన్నెల అత్యద్భుత ప్రదర్శన చేసినట్లు తెలిపారు. తన అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం హర్షణీయమన్నారు. అనంతరం ఆమెను అభినందించారు. కార్యక్రమంలో నాట్యాలయ నృత్యకారులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి



అఖిలభారత యాదవ మహాసభలో తవక్లాపూర్, శేషాయికుంట గ్రామకమిటీ సభ్యులు

డిండి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు జరగనున్న ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన యాదవులకు అత్యధిక స్థానాలు కేటాయించాలని అఖిల భారత యాదవ మహాసభ డిండి మండల అధ్యక్షుడు బద్దెల శ్రీనివాస్‌యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.సీ.ఎల్.అశోక్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి జక్కుల ఆంజనేయులుయాదవ్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం మండలంలో అధిక జనాభా కలిగి ఉన్న యాదవులకు స్థానిక సంస్థల్లో అధిక స్థానాలు కేటాయించి తగు న్యాయం చేయాలని వారు రాజకీయ పార్టీలను కోరారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా యాదవుల అభివృద్ధికి అన్ని రాజకీయపక్షాలు సహకరించాలని కోరారు. అనంతరం మండలంలోని శేషాయికుంట, తవక్లాపూర్ అఖిల భారత యాదవ మహాసభ గ్రామకమిటీలను ఏర్పాటు చేశారు. శేషాయికుంట అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడిగా శీమర్ల మల్లేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ రమేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడు కేశమోని శ్రీను, సహాయ కార్యదర్శి వడ్లకొండ వెంకటమ్మ, కోశాధికారిగా బొంగు తిరుపతయ్య యాదవ్, తవక్లాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు బద్దుల నిరంజన్, ప్రధాన కార్యదర్శి జక్కుల జంగయ్య, ఉపాధ్యక్షుడు శిమర్ల మల్లేష్, సహాయ కార్యదర్శి కడారి మల్లేష్‌యాదవ్, కార్యవర్గ సభ్యులుగా శేఖర్, కడారి ఆంజనేయులు, సైదులు, కుందేళ్ల జంగయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడటౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా నూతన అధ్యక్షుడు చనుమోలు లక్ష్మీనారాయణ కోరారు. పట్టణంలోని నిర్వహించిన డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దివ్యాంగ ఉద్యోగులు పని చేసే ప్రదేశంలో ఇబ్బందులు పడుతున్నారని, వేధింపులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం దివ్యాంగ ఉద్యోగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారి అవసరాలు తీర్చే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు మాలి వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, సైదాచారి, సురేందర్, శ్రీనయ్య జానయ్య, నాగభూషణ చారి తదిరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉట్టి కొట్టే కార్యక్రమం

- గోవింద నామస్మరణతో మార్మోగిన శ్రీవారి ఆలయం





వీటీనగర్‌లో ఉట్లకు పూజలు చేస్తున్న చైర్మన్ లక్ష్మణ్, కొండపై ఉట్లు కొడుతున్న యాదవులు

చింతపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్ కొండపై నెలకొన్న శ్రీవారి ఆలయంలో వైష్ణవ ఆచార ప్రకారం ఆదివారం ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సమీపంలో యాదవులు ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవానీప వన్‌కుమార్, ధర్మకర్తలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉసురు పోసుకోవద్దు : పీఎస్‌యూ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థుల ఉసురు పోసుకోవద్దని ప్రొగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఏళ్ల తరబడి విడుదల చేయకపోవడం సరికాదన్నారు. విద్యాలయ యాజమాన్యాలు నుంచి విద్యార్థులు వేధింపులకు గురవుతున్నారని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యకు దూరమవుతున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులు, విద్యారంగంపై అనుసరిస్తున్న వైఖరి రాష్ట్రాభివృద్ధిపై పడుతుందన్నారు. ఇక కళాశాలల యాజమాన్యాలు విద్యాసంస్థల బంద్‌కు ఇచ్చిన పిలుపుతో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. యజమాన్యాలు, ప్రభుత్వానికి మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘ జిల్లా కన్వీనర్ మచ్చ వంశీ, కోకన్వీనర్ నల్లగంతుల అజయ్, వరికుప్పల రవిశంకర్, చారి, అజ్జు, ఫయాజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని కలిసిన ఉపాధ్యాయులు



ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉపాధ్యాయులు

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డిని మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన రంగుండ్ల పాఠశాలకు చెందిన మంత్రాల సురేందర్‌రెడ్డిని ఆయన శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్, నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, కాలం నారాయణరెడ్డి, మేకల జాన్‌రెడ్డి, సత్తయ్య, పరుశురాంగౌడ్, సైదిరెడ్డి, సక్రునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సైదులురావుగౌతమ్, యూసుఫ్‌పాషా పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



ఎల్లాపురంతండాలో బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. మండలంలోని ఎల్లాపురంతండాలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. గత ఎన్నికల్లో పలు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. ప్రస్తుతం యూరియాను సక్రమంగా సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతానికి కార్యకర్తలు సమన్వయంలో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా తండావాసులు ఆయనకు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. కా ర్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆంగోతు సూర్యభాష్యనాయక్, నాయకులు అల్లిపెద్దిరాజుయాదవ్, టీవీ.రమణరాజు, ఎం.మునినాయక్, మాజీ సర్పంచులు తుడుం ముత్తయ్య, బిక్షానాయక్, కోట్యానాయక్, పురుషోత్తంయాదవ్, నాయకులు వడ్డె సతీష్‌రెడ్డి, గుండెబోయిన అంజయ్య, దేవునాయక్, కలకొండ వెంకటేశ్వర్లు, చవ్వా నాసర్‌రెడ్డి, కోటిరెడ్డి, గంగరాజుయాదవ్, ఎల్లయ్య, రాజుయాదవ్, బిచ్యాలు, నరేష్, దశరథ, సర్మన్‌నాయక్, లాలునాయక్, తావునాయక్, బాలునాయక్, రాజునాయక్, రమేష్, శంకర్ పాల్గొన్నారు.